ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
సోమవారం 9 సెప్టెంబరు 2024





కావలి టౌన్ : కలుగోళశాంభవి ఆలయంలో 25 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించిన అష్టభుజ వినాయకుడు

జై గణేశా..

జైజై గణేశా ?

- భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు • వాడవాడలా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ
- గణనాథులకు ప్రత్యేక పూజలు • ఉత్సాహంగా ఉట్టి మహోత్సవాలు
- పలు ప్రాంతాల్లో అన్నదానం • సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 8: జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాల్లో వినాయక చవితి సంబరాలు అంబరాన్ని అంటేలా సాగాయి. ఊరూరా, వాడవాడలా గణపతి ప్రతిమలు, విగ్రహాలు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పందిళ్ల వద్ద పలుచోట్ల ఉట్టి మహోత్సవాలు, కోలాటాలు, భజనలు కొనసాగించారు. ఆదివారం మధ్యాహ్నం పలుచోట్ల అన్నదానం చేశారు. రెండురోజూ కూడా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బహిరంగ మండపాల వద్దే కాకుండా ప్రతి ఇంటిలోనూ మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి, సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకున్నారు. నెల్లూరు నగరంలోని వీధులన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడాయి. బాణసంచా కాల్పులతో మారుమోగాయి. గణేష్ మండపాల వద్ద పాటలు, నృత్యాలతో యువత ఉర్రూతలూగారు. కాగా ఈ ఏడాది జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు విజయవాడ వరద బాధితులకు సాయంలో మునిగితేలడంతో పందిళ్ల వద్ద నేతల సందడి పెద్దగా కనిపించలేదు. నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్, రాణా ప్రతాప్ సెంటర్, మాగుంట లేఅవుట్ లంబోదర సెంటర్లలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొని గణపతి విగ్రహాలకు పూజలు చేశారు. భక్తులనుద్దేశించి మాట్లాడారు. అలాగే జిల్లాలోని ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, కందుకూరు, కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గ గ్రామాల్లో చవితి సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

● గణపతి లడ్డూ రూ. 8 లక్షలు

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో లంబోదర మిత్రమండలి ఏర్పాటు చేసిన గణపతి లడ్డూకు ఆదివారం రాత్రి వేలంపాట జరిగింది. ఈ లడ్డూను వేలంలో రూ.8లక్షలకు తేజా డెవలపర్స్ శ్రీనివాసరెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



● భక్తులతో గణేష్ ఘాట్ కళకళ

గణేష్ ప్రతిమలను శనివారం రాత్రి నిమజ్జనం చేసేందుకు తరలివచ్చిన భక్తులతో మూలాపేటలో గణేష్ ఘాట్ కళకళలాడింది. ఉదయం గణేష్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ సేవా సమితి నాయకులు, బీజేపీ అనుబంధ సంస్థ నాయకులు పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



పొదలకూరు : పుట్టాయగుంటలో గోవు పాలు తాగుతున్నట్లు పుట్టలోని వినాయకుడు



నెల్లూరు : హరనాథపురంలో ప్రతిష్ఠించిన పసుపు,కుంకుమ, చందనం పొట్లాలతో తయారు చేసిన వినాయకుడు



కనకమహల్ సెంటర్‌లోని సీఎంఆర్ వద్ద..



గుడ్లూరు జెండా చెట్టు వద్ద ఏర్పాటుచేసిన గరుడవాహన వినాయకుడు



నిప్పో సెంటర్‌లోని గణనాథుడు



బారకాసు సెంటర్‌లోని లంబోదరుడు



నెల్లూరు : బాలాజీనగర్ లక్కీబోర్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దశకంఠ గణనాథుడు

24 గంటల్లో చోరీ కేసు ఛేదింపు

- రూ.59.46 లక్షల సొత్తు స్వాధీనం • ఇద్దరు నిందితుల అరెస్టు
- కందుకూరులో జ్యూయలరీ షాపులో దొంగతనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం)/కందుకూరు, సెప్టెంబరు 8: కందుకూరులోని జ్యూయలరీ షాపులో జరిగిన చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.59.46 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ జీ.కృష్ణకాంత్ ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కందుకూరులోని పెద్ద బజారుకు చెందిన అనుముల శెట్టి శ్రీకాంత్ గాయత్రి జ్యూయలరీ షాపును నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులోని 760 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. పక్కన ఉన్న మూడు కిరాణా దుకాణాల్లోనూ దొంగతనానికి పాల్పడి రూ.25 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్ఐ మహేంద్రనాయక్, సీసీఎస్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారంగా నిందితులు సీతారామపురం బెస్తకాలనీకి చెందిన ఎం బాలనారాయణ, అతని తమ్ముడిని గుర్తించి గాలింపు చేపట్టారు. నిందితులు చోరీ సొత్తును శనివారం రాత్రి విజయవాడలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రత్యేక బృందాలు వారిని అరెస్ట్ చేశాయి. వారి నుంచి రూ.56,28,440 విలువ చేసే 760 గ్రాముల బంగారుతోపాటు రూ.3.18 లక్షల నగదుతో కలిపి మొత్తం రూ.59,46,440 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన నిందితులు చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఈ కేసులోని నిందితుడు జువైనల్‌పై గతంలో కలిగిరిలో రెండు, పొదిలిలో రెండు, ఒంగోలు, ఎస్ఆర్ పురంలో ఒక్కో కేసు నమోదై ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో శ్రీకాకుళం జిల్లా పలాస పోలీసు స్టేషన్ పరిధిలో, ప్రకాశం జిల్లా టంగుటూరులో చోరీ కేసుల్లో నిందితుడిగా అంగీకరించారు. మరో నేరస్థుడు బాలనారా యణపై ఒంగోలు పోలీసు స్టేషన్‌లో ఒక చోరీ కేసు ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును 24 గంటల వ్యవధిలో ఛేదించిన కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ బీబీ మహేంద్రనాయక్, క్లూస్‌టీమ్ ఎస్ఐ వీ బ్రహ్మయ్య, కానిస్టేబుళ్లు హరిబాబు, రవితేజ, తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేశారు.

కందుకూరులో కలకలం

కందుకూరు పెద్దబజారులోని గాయత్రి జ్యూయలర్ షాపులో జరిగిన దొంగతనం తీవ్ర కలకలం రేపింది. వినాయక చవితి రోజు ఉదయాన్నే ఈ వార్త వెలుగుచూడటంతో పట్టణ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు వినాయక మండపాల ఏర్పాట్లలో పట్టణమంతా సందడిగా కనిపించింది. తెల్లవారేలోగా చోరీ జరిగిందన్న వార్త ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఇటీవల కందుకూరులో తరచూ దొంగతనాలు జరగడం పరిపాటిగా మారింది. ఈ తరుణంలో ఇది అతిపెద్ద దొంగతనం కావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత దుకాణ యజమానులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తక్షణం దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అయితే దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినా అప్పటికే వారి దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డు కావటం, దొంగలు కూడా గతంలో పలు దొంగతనాలకు పాల్పడిన వారే కావటంతో వారిని పట్టు కోవటం పోలీసులకు సులభతరం అయింది.

రెవెన్యూ యంత్రాంగంలో కదలిక

- ప్రభుత్వ స్థలానికి రక్షణ • ఆక్రమణలు తొలగించి స్వాధీనం

నెల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండల పరిధిలోని బుజబుజనెల్లూరు వద్ద సుమారు రూ.కోటిన్నర విలువైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు రక్షించారు. ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకుని బోర్డులు పాతారు. తహసీల్దార్ లాజరస్ నేతృత్వంలో ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో విష్ణులతో పాటు మరికొంతమంది వీఆర్వోలు ఈ ఆక్రమణల తొలగింపులో భాగస్వాములయ్యారు.

సర్వే నంబర్ 63-4లో 80 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గత కొంతకాలం నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొంత స్థలంలో నిర్మాణాలు కూడా వెలిశాయి. గతేడాది రూరల్ మండల అధికారులు ఈ ఆక్రమణలను అడ్డుకున్నారు. నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు కూడా జారీ చేశారు. కానీ నాడు రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనక్కు తగ్గారు. కానీ ఇప్పుడు మిగిలిన సుమారు 150 అంకణాల స్థలం కూడా కబ్జాకు గురవుతూ వస్తుండడంతో కొందరు స్థానికులు కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని రూరల్ మండలాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ పోలీసులకు లేఖ రాశారు. ఆక్రమణల తొలగింపు సహకరించాలని కోరారు. ఆదివారం ఉదయం రెవెన్యూ, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో ఆక్రమిత స్థలం వద్దకు వెళ్లి ఆక్రమణలు తొలగించారు. అక్కడ ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లాజరస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు ఫేక్ పట్టాలు సృష్టించి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తున్న తహసీల్దార్ లాజరస్, ఆర్ఐ వెంకటేష్

బొమ్మవరం చెరువులో కబ్జా

- ఐదు ఎకరాల్లో పంట సాగు

అనతసాగరం, సెప్టెంబరు 8: మండలంలోని బొమ్మవరం పరిసర గ్రామాల్లో ఎకరా పొలం రూ.5 నుంచి రూ.10 లక్షలు పలుకుతుండగా కొందరు చెరువు భూముల్లో పాగా వేస్తున్నారు. ఇప్పటికే చెరువు రెండింతలు ఆక్రమించేసి పంటలు సాగుచేశారు. ఇంతజరుగుతున్నా ఇరిగేషన్ అధికారుల్లో చలనం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా వినాయక చవితి వేడుక సందర్భంగా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో కొందరు చెరువులో ఐదు ఎకరాల భూమిని చదును చేసి పామాయిల్ మొక్కలు నాటిన వైనం వెలుగులోకి వచ్చింది. నెలరోజుల ముందు ఈ ప్రాం తంలో మొక్కలు తీస్తూ చెరువు ఆక్రమణకు పాల్పడగా స్థానికులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా మళ్లీ అదే స్థలం ఆక్రమణ చేస్తున్న విషయం తెలుసుకొని వీఏవో కృష్ణ ఆదివారం ఆక్రమణాదారులను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. కానీ వారు ఏమాత్రం లెక్కచేయలేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి కబ్జాల చెర నుంచి బొమ్మవరం చెరువుకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.




చెరువు భూమిలో సాగు చేసిన పంట

అన్‌సీజన్‌లోనూ ధర అదుర్స్

- నిమ్మకాయల రేటు పైపైకి...
- బస్తా రూ.7.5 వేల నుంచి రూ. 10 వేల వరకు..
- హర్షాతిరేకాల్లో రైతులు

పొదలకూరు, సెప్టెంబరు 8 : సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నిమ్మకాయలను అడిగే వారుండరు. ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. అయితే పక్షం రోజులుగా మార్కెట్లో నిమ్మకాయలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు, వివాహాలు, గృహ ప్రవేశాల సందర్భంగా గత నెలలో నిమ్మకు బాగా డిమాండ్ ఏర్పడింది. మంచి ధరలు పలికాయి. ప్రస్తుతం వినాయక చవితి వేడుకల నేపథ్యంలో కాయలు ధరలు అమాంతం పెరిగాయి. బస్తా (లూజు) ధర రూ.7.5 వేలు నుంచి రూ.10వేలు పలుకుతున్నాయి. కిలో రూ.80 నుంచి రూ.110 ధరలు పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. గతంలో ఎప్పుడూ కూడా సెప్టెంబరులో ఈ స్థాయిలో ధరలు పెరిగింది లేదు. తోటల్లో నిమ్మకాయల దిగుబడి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో రైతులు ఆనందపడుతున్నారు. రైతుల అదృష్టం బాగుండి రెండు బస్తాల నాణ్యత కలిగిన కాయలు తోటలో ఉంటే సుమారు రూ.20వేల వరకు రానున్నాయి. పండుకాయలు కూడా కిలో రూ.60 పైమాటే. ప్రస్తుతం రైతులు నిమ్మ తోటలకు నీరు పెట్టడం లేదు. ఇప్పుడు నీరు పెడితే త్వరగా పూతపూసి కాయల దిగుబడులు, ధరలు లేని సమయంలో వస్తాయంటున్నారు. ఆలస్యంగా నీరు పెడితే జనవరి, ఫిబ్రవరి నెలల్లో కాయల దిగుబడి వచ్చి ధరలు గిట్టుబాటు అవుతాయని రైతులు అంటున్నారు. అయితే ప్రతి సీజన్‌లోనూ కాయలు కావాలనుకునే రైతులు మాత్రం ప్రస్తుతం తమ తోటలకు నీరు పెడుతున్నారు.



కండలేరు వరద కాలువ లీకేజీ

- వృథా అవుతున్న జలాలు
- ఏటా ఇదే సమస్య.. పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, సెప్టెంబరు 8: సోమశిల నుంచి కండలేరు ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేసే ప్రధాన తెలుగు గంగ వరద కాలువ అధ్వాన స్థితికి చేరుకొంది. కాలువ గోడల నుంచి లీకేజీ కొనసాగుతోంది. జలాశయం కుడివైపు కొండను తొలచి అప్పట్లో కాలువ నిర్మాణం చేపట్టారు. మొత్తం మూడు కిలోమీటర్ల ఉన్న గోడ లోపభూయిష్టంగా ఉంది. చేపట్టాల్సిన పటిష్ట పనులు చేపట్టక పోవడంతో కాలువ మనుగడ నేడు ప్రశ్నార్థకమైంది.

ఈ ఏడాదికిగానూ గతనెల 22 నుంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. తొలుత రెండు వేల క్యూసెక్కులు విడుదల చేసి క్రమేణా నీటి మోతాదును పెంచారు. వారం క్రితం 6,000 క్యూసె క్కుల ప్రవాహం కొనసాగుతుండగా, ప్రస్తుతం 2,000 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కాలువ సామర్థ్యం 11,500 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రవాహానికి కాలువ గోడల నుంచి లీకేజీలు కొనసాగుతున్నా యి. దీంతో గోడ పాచిపట్టి అధ్వానంగా తయారైంది. కాలువ వినియోగంలోకి వచ్చినప్పటి నుంచి ఈసమస్య ఉన్నా.. ఇంత వరకు సీపేజీ, లీకేజీల అడ్డుకునేం దుకు అధికారులు తీసుకున్న చర్యలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయి.



కండలేరు వరద కాలువ

● ఫలితమివ్వని గ్రౌటింగ్ పనులు

వరద కాలువ లీకేజీ నిర్మూలనకు గ్రౌటింగ్ పనులు చేసేలా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గతంలో సుమారు రూ.7 కోట్లు విడుదల చేసింది. ఆదిశగా పనులు జరిగాయి. అప్పట్లో కొంత మేరకు లీకేజీని అరికట్టగలిగారు. తూతూమంత్రంగా పనులు చేయడంతో మళ్లీ కాలువ యథాస్థితికి చేరుకుంది. ఇటీవల పరమానంద ఆశ్రమం ఎగువన భూగర్భ లీకేజీ కారణంగా సోమశిల-నెల్లూరు ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుకు గండి పడింది. రాకపోకలు నిలిచిపోయాయి. గత వైసీపీ పాలనలో కాలువ మనగడ కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా లీకేజీలపై దృష్టి పెట్టి వాటిని అరికట్టాల్సి ఉంది.



కండలేరు వరద కాలువ గోడ నుంచి కొనసాగుతున్న లీకేజీ

ప్రాణం పోతుందంటే నమ్మాను..

- 'విప్రో'లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని, మధ్యవర్తి తల్లికి ప్రమాదం జరిగిందని నమ్మబలికి..
- రూ.3 లక్షలకుపైగా నగదు, 3 క్రెడిట్ కార్డుల్లో రూ.5 లక్షల స్వాహా
- చివరికి నమ్మిన వ్యక్తి మోసం చేశాడని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు
- క్రెడిట్ కార్డుల సంస్థల ఏజెంట్ల వేధింపులు తట్టుకోలేక..
- డైరీలో మరణవాఙ్మూలం రాసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8: పక్కింటి ప్రేమ్‌చంద్‌ను పూర్తిగా నిమ్మాను.. ఒక ప్రాణం పోతుందంటే నమ్మి నగదు, క్రెడిట్ కార్డులు ఇచ్చాను.. ఇప్పుడు నా ప్రాణం పోతోంది.. నేను నగదు ఇచ్చినట్లు నా దగ్గర సాక్ష్యాలు సరిగా లేవు.. ఆ నగదు కోసం కుదవపెట్టిన బంగారానికి వడ్డీ, క్రెడిట్ కార్డుల రుణ బకాయిల భారం నాపై పడింది.. ఏమి చేయాలో తెలియడం లేదు అంటూ ఓ వ్యక్తి తన డైరీలో మరణ వాఙ్మూలం రాసుకుని ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. బాధితుల కథనం మేరకు...





ఇంట్లో ఉరి వేసుకున్న హరినాథ్‌ను కిందికి దించుతున్న స్థానికులు, (ఇన్‌సెట్‌లో) హరినాథ్(ఫైల్)

నెల్లూరు నగరంలోని నవాబుపేట మంగళ వీధికి చెందిన బుడ్డాబత్తిన సత్యనారాయణ, సుమతి దంప తులకు హరినాథ్(44) ఒక్కడే కుమారుడు. ఇతను డిగ్రీ పూర్తి చేసి ఏదో చిన్న ఉద్యోగం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ముందు తండ్రి, కొంతకాలం తరువాత తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఒంటరిగా మిగిలిన అతను తాను ఎవరి కోసం జీవించాలని మదనపడుతుండడంతో గమనించిన తండ్రి తమ్ముడు (బాబాయ్) ప్రకాష్‌రావు అండగా నిలిచాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం బెంగళూరులో నెలకు రూ.30 వేల జీతంతో ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. అక్కడ విధులు నిర్వర్తించుకుంటు డంగా అతని జీవితంలోకి నవాబు పేట మంగళవీధిలో తన పక్కింట్లో నివాసం ఉంటున్న ప్రేమ్‌చంద్ శనిలా దాపురించాడు. అతనితో మంచి పరిచయం ఏర్పడింది. అప్పటికే హరినాథ్ మంచి కంపెనీలో ఎక్కువ జీతంతో ఇంకా మంచి ఉద్యోగం సంపాదిం చాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలుసుకుని అతనిని బుట్టలో వేసుకున్నాడు. విప్రో సంస్థలో మంచి ఉద్యో గం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అయితే అందుకు కొంత ఖర్చు అవుతుందని చెప్పాడు. దీంతో హరినాథ్ మంచి కంపెనీలో చేరుతానన్న భావనతో తొలిసారిగా ప్రేమ్‌చంద్‌కు రూ.1.20 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత ఉద్యోగం ఇప్పించే మధ్యవర్తి తల్లికి ప్రమాదం జరిగిందని, అతనికి ఆర్థికంగా అండగా నిలిస్తే మనకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ త్వరగా వస్తుందని నమ్మించాడు. దీంతో అతని మాటలు గుడ్డిగా నమ్మిన హరినాథ్ వివిధ బ్యాంకుల నుంచి పొందివున్న 3 క్రెడిట్ కార్డులు ఇచ్చి ఓటీపీలు చెప్పడంతో ఆ కార్డుల నుంచి ప్రేమ్ చంద్ దశల వారీగా రూ.5 లక్షలు డ్రా చేశాడు. ఆ వెంటనే విప్రో కంపెనీ నుంచి ఫేక్ జాయినింగ్ లెటర్‌ను పంపాడు. ఉద్యోగం వచ్చిందన్న ఆనందంలో హరినాథ్ ఉండగా చెన్నై నుంచి ల్యాప్‌టాప్ పంపుతున్నారని, మీరు వర్క్ ఫం హోమ్ చేయాల్సి ఉంటుందని, నెలకు రూ.60 వేల జీతం అని నమ్మబలికాడు. కొద్ది రోజులకు అడ్రస్ తప్పని, మీకు పంపిన ల్యాప్‌టాప్ వెనుకకు వెళ్లిందని చెప్పాడు. దీంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నేరుగా మీరు చెన్నైకు వచ్చి ల్యాప్‌టాప్ తీసుకోండంటూ చెప్పాడు. అయితే మీరు ఉద్యోగం కోసం ఇంకా రూ.1,97,800 చెల్లించాలించాలని సూచించాడు. దీంతో హరినాథ్ మృతి చెందిన తన తల్లికి సంబంధించిన బంగారు నగలు కుదవపెట్టి ప్రేమ్‌చంద్‌కు ఫోన్‌పే ద్వారా నగదు పంపాడు. అప్పటి నుంచి ప్రేమ్‌చంద్ ఫోన్ నెంబరు స్విచ్ ఆఫ్ అయ్యింది. ఈ క్రమంలో నెల రోజులు పాటు అతనికి ఫోన్ చేస్తూనే ఉన్నాడు. అయినా స్పందించక పోవడం, సమాధానం చెప్పకపోవడంతో తాను మోసపోయానని గ్రహించాడు. ఇదిలా ఉండగా క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లించకపోవడంతో ఆ కంపెనీల వారు ఫోన్‌లు చేసి ఇబ్బంది పెడుతుండటం, చివరిగా ఇంటికి వస్తామని బెదిరించడంతో అతను మానసికంగా చితికిపోయాడు. హరినాథ్ మానసిక స్థితిని గమనించిన బాబాయ్ ప్రకాష్‌రావు అసలు ఏమి జరిగిందని నిలదీయడంతో జరిగిన విషయం తెలిపాడు. దీంతో గత నెల 25వ తేదీన నావాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఈ నెల 5వ తేదీన కేసు నమోదు చేశారు. కాగా మానసికంగా ఆందోళన చెందుతున్న హరినాథ్ ఈ నెల 5వ తేదీ సాయంత్రం తన డైరీలో మరణ వాఙ్మూలం రాసుకుని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బాబాయ్ ప్రకాష్‌రావు స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి చావుబ్రతుకుల్లో ఉన్న హరినాథ్‌ను కిందికి దించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో ప్రకాష్‌రావు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 8 : మండలం లోని కాటేపల్లి రహదారిపై శనివారం మండపం రోడ్డు సమీపంలో ఇన్నోవా కారు అతివేగంతో ప్రయాణిస్తూ సాలిపేట వైపు ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను ఢీకొనడంతో కోడూరు, పాతపాలెం చెందిన మత్స్యకా రుడు కంజి లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థాని కులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరులో ఓ ప్రైవే టు వైద్యశాలకు తరలించారు. బంధువులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు.

ఎస్కేప్ నుంచి నీరు నిలిపివేత

- శ్రమించిన ఇంజనీర్లు, గజ ఈతగాళ్లు

కలువాయి, సెప్టెంబరు 8 : సోమశిల కండలేరు వరద కాలువ 5.5కిలోమీటర్ల వద్ద ఉన్న ఎస్కేప్ నుంచి బయటకు వస్తున్న నీటిని ఆదివారం నిలిపివేసినట్లు తెలుగు గంగ కుల్లూరు సబ్ డివిజన్ డీఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. విశాఖ నుంచి వచ్చిన గజ ఈతగాళ్లు నాలుగు రోజులుగా శ్రమించి నీరు బయటకు పోకుండా నిలువరించారని చెప్పారు. ఎస్కేప్ గేట్లు దెబ్బతిని వచ్చిన నీటితో కుల్లూరు చెరువు నిండి ఆయకట్టు పొలాలపై పడిన విషయం తెలిసిందే. కండలేరు కాలువలో నీటి ప్రవాహం ఉండటంతో ఎస్కేప్ నుంచి నీరు బయటకు రాకుండా చేయడం క్లిష్టంగా మారింది. తెలుగుగంగ ఎస్ఈ రమణారెడ్డి, డీఈ శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో గజ ఈతగాళ్లు కష్టపడి నీరు బయటకు పోకుండా చేయగలిగామని వివరించారు. కుల్లూరు చెరువు కలుజు వాగు ఆక్రమణలపై తెలుగుగంగ ఉన్నతాధికారులతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు లేఖ రాసినట్లు డీఈ తెలిపారు. కలుజు వాగు ద్వారా 2500క్యూసెక్కుల నీరు పెన్నానదిలోని పోవాల్సి ఉండగా 60,70క్యూసెక్కులకే వాగు పొంగి పొలాలపై నీరు వెళుతుందన్నారు. ఎస్కేప్ ద్వారా 2500క్యూసెక్కుల నీరు కుల్లూరు చెరువుకు విడుదల చేయాల్సిన వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వాగు ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన గుర్తు చేశారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

కావలి రూరల్, సెప్టెంబరు 8: విద్యుదాఘాతంతో పూరిల్లు తగులబడి పోయిన సంఘటన శనివారం రాత్రి పెదపట్టపుపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కుర్రు శ్రీను కుటుంబసభ్యులు వినాయక మండపం వద్ద ఉండగా రాత్రి 10గంటల సమయంలో ఒక్కసారిగా ఇంటి నుండి మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి శ్రీనుకు సమాచారం ఇచ్చి మంటలు అదుపు చేసేలోపు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలోని ఇంటిలో ఉన్న నగదు, బంగారంతో పాటు వస్తువులతో పాటు సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకుని పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	116
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6914
వెండి కిలో ధర	రూ. 85,700
వెండి ఒక గ్రాము	రూ. 88.70

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

- వైద్యశాలకు తరలించిన పోలీసులు

కావలి రూరల్, సెప్టెంబరు 8: పట్టణ ట్రంక్‌రోడ్డులోని బ్రిడ్జి సర్కిల్‌లో శనివారం మద్యం మత్తులో ఒక వ్యక్తి వీరంగం సృష్టించాడు. ఒంటిపై చొక్కావిప్పి దారిన వచ్చే పోయే వాహనాలకు ఎదురెళ్తూ రోడ్డుకు అడ్డంగా నిలబడి రాకపోకలకు అంతరాయం కల్పించాడు. స్థానికుల సమాచారంతో 1వ పట్టణ ఎస్‌ఐ అంబేడ్కర్ ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోబోగా తన వద్ద ఉన్న కీచైన్ తాళంతో ఛాతిపై గాయపర్చుకుని పోలీస్ వాహనానికి ఎదురునిలిచి దుర్భాషలాడాడు. దీంతో ఆ వ్యక్తిని పోలీస్ వాహనంలో ఎక్కించుకుని ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఆ వ్యక్తి మతి స్థిమితం లేని వ్యక్తా.. లేక మత్తుపదార్థాలు తీసుకుని ఉన్నాడా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేశారు.

సోమశిలలో 45.360 టీఎంసీల నీరు నిల్వ

- ఇన్‌ఫ్లో 19,127 క్యూసెక్కులు

అనంతసాగరం, సెప్టెంబరు 8: సోమ శిల జలాశయానికి ఎగువ నుంచి ఆది వారం 19,127 క్యూసెక్కుల వరద వస్తు న్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రాజె క్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 45.360 టీఎంసీ లకు చేరుకొంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 2000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.



దుత్తలూరు ఎంఈవో కార్యాలయం

నిర్వహణకు డబ్బుల్లేవ్!

- ఎంఈవో కార్యాలయాలకు కాసుల కష్టాలు
- గతేడాది నుంచి విడుదల కాని నిధులు
- సొంత డబ్బులు వెచ్చిస్తున్న విద్యాధికారులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 8 : జిల్లాలో మండల విద్యావనరుల కేంద్రాల (ఎంఈవో కార్యాలయాలు) నిర్వహణకు వార్షిక నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో ఎంఈవోలు తమ సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. జిల్లాలో 37 మండల విద్యావనరుల కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి ఏడాదికి నిర్వహణ ఖర్చుల కింద ప్రభుత్వం రూ.70 వేలు మంజూరు చేస్తుంది. 2023-24లో గత వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ మంజూరు చేయలేదు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా పైసా విడుదల కాలేదు. గతంలో పాఠశాలలు పునః ప్రారంభించిన కొన్ని రోజులకే నిధులు మంజూరయ్యేవి. ఇప్పుడు జాప్యం నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎంఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సొంత డబ్బులు వెచ్చించి..

ఎంఈవో కార్యాలయాలకు సంబంధించి విద్యుత్ చార్జీలు, ఇంటర్నెట్, స్టేషనరీ, రవాణా, సమావేశాలు, సమీక్షలు, కార్యాలయ నిర్వహణకు నిధులు అవసరం ఉంటుంది. అయితే, ప్రభుత్వం నుంచి నగదు అందకపోవడంతో తమ జేబులో నుంచే తీసి ఖర్చు చేస్తున్నట్లు పలు వురు ఎంఈవోలు వాపోతున్నారు. సమావే శాల సమయంలో టీ, స్నాక్స్‌కు సైతం తాము వెచ్చించాల్సి వస్తోందని అంటు న్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. కాగా, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ ఎంఈవో కార్యాలయాల నిర్వహణ నిధులకు సంబంధించి ఇప్పటికే బిల్లులను ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలో మంజూరు అవుతాయని చెప్పారు.

పాడి రైతులకు క్రెడిట్ కార్డులు

- అర్హులందరికీ పంపిణీకి చేసేందుకు చర్యలు
- రూ.1.50లక్షల వరకు రుణం పొందే అవకాశం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 8: జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వర్షాభావ పరిస్థితులతో కొందరు రైతులు వ్యవసాయం చేయలేక కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం పాడిరంగం వైపు దృష్టి సారిస్తున్నారు. వీరి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పాడి రైతు పశువులు, దాణా.. మేత కోసం చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండదు. పంటల సాగుకు పెట్టుబడుల కోసమే రైతులు ఇతరుల వద్ద వడ్డీలకు నగదు తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పాడి రైతన్నకు చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం పశుకిసాన్ క్రెడిట్ కార్డులను (పీకేసీసీ) అందుబాటులోకి తీసుకొచ్చింది.



వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యంగా క్రెడిట్ కార్డుల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

రూ.1.50 లక్షల వరకు రుణం: ఈ క్రెడిట్ కార్డుతో ప్రతి పాడిరైతు బ్యాంకుల్లో రూ.1.50 లక్షల వరకు రుణం పొందే అవకాశముంది. జిల్లాలోని 594 రైతుసేవా కేంద్రాల పరిధిలోని ఒక్కో పశుసంవర్ధక సహాయకుడు బ్యాంకర్లను సమన్వయం చేసుకొని కనీసం తన పరిధిలోని 30మంది రైతులను ఈ క్రెడిట్ కార్డుకు దరఖాస్తు చేసుకొనేలా చర్యలు తీసుకుంది. ఈ లెక్కన జిల్లాలో సుమారు 17,820 మంది పాడి రైతులకు బ్యాంకులు ఈ క్రెడిట్ కార్డుల పంపిణీ చేయనున్నారు. అర్హులైన పాడి రైతులందరికీ క్రెడిట్ కార్డులు అందించేలా పశుసంవర్ధక శాఖ సిబ్బంది చర్యలు చేపడుతోంది.

ప్రయోజనాలివే:

- అవసరమైనప్పుడు నగదు తీసుకుని పాడి పశువుల పోషణకు వినియోగించుకోవచ్చు.
- తీసుకున్న నగదును 40రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. గడువు దాటిన తరువాత 7శాతం వడ్డీతో చెల్లించాలి. ఇందులో 3శాతం వడ్డీని ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది.
- అవసరమైనప్పుడు సొమ్ము వాడుకోవడం, పాల విక్రయాలతో ఆదాయం వచ్చినప్పుడల్లా 40రోజుల్లోగా జమ చేయడం, తిరిగి రుణం తీసుకోవచ్చు.
- ఈ రుణాలను సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం

పశుకిసాన్ క్రెడిట్ కార్డులతో కలిగే ప్రయోజనాలపై పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు రైతులకు అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే బ్యాంకర్లు పలువురు పాడి రైతులకు ఈ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి రైతుకు ఈ కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతాం.

- ఎస్.శశిధర్, పశు సంవర్ధక సహాయ సంచాలకులు, ఉదయగిరి

15న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 8 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 15వ తేదీన అండర్-14 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డి.నిఖిలేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు 2010 సెప్టెంబరు 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రస్‌కోడ్, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, మూడేళ్ల స్కూల్ సర్టిఫికెట్‌లతో సంబంధిత తేదీలో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు క్రీడా ప్రాంగణంలో సంప్రదించాలని తెలిపారు.

అక్షరాస్యత సాధనలో వయోజన విద్య తోడ్పాటు

- ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



మాట్లాడుతున్న వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఆజాద్

తోటపల్లి గూడూరు, సెప్టెంబరు 8: మండలంలోని చెన్నపల్లిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వయో జన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎస్ మహమ్మద్ ఆజాద్ పాల్గొని వయోజన విద్య ప్రాధా న్యతను వివరించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఫణికుమార్ కృషిని ప్రశంసించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. జానపద కళావేదిక చక్రపాణి బృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ప్రధానో పాధ్యాయులు సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వయోజన విద్య ఏపీవో మస్తాన్‌రెడ్డి, ప్రభాకర్, విద్యా కమిటీ చైర్మన్ ఆత్మకూరు ఠాగూర్, స్థానిక ప్రజాప్రతి నిధులు బైనబోయిన శ్రీనివాసులు, కైలాసం రాజా, ఊటుకూరు ధర్మదేవ్, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు 325 మంది రెవెన్యూ సిబ్బంది

- నలుగురు డిప్యూటీ కలెక్టర్‌లు..

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8 : విజయవాడలో సంభవించిన వరద నష్టాలను అంచనా వేసి నివేదిక తయారు చేయడానికి జిల్లా నుంచి 325 మంది రెవె న్యూ అధికారులను నియమించారు. ఇంత పెద్ద సంఖ్యలో అధికారులను జిల్లా నుంచి ఇతర జిల్లాల వరద నష్టాలకు కేటాయించటం ఇదే ప్రథమని తెలుస్తోంది. వీరిలో నలుగురు డిప్యూటీ కలెక్టర్‌లు, 25 మంది తహసీల్దార్లు, 25 మంది వీఆర్వోలు, మిగిలిన వారు తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ సహాయకులు ఉన్నారు. వీరందరూ ఈనెల 11వ తేదీ వరకు విజయవాడలో వరద నష్టాల వివరాల సేకరణ విధుల్లోఉంటారని డీఆర్వో లవన్న ఆంధ్రజ్యోతికి తెలిపారు. వరదలు కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు ఇతర వివరాలను వారు నమోదు చేయనున్నారు. విధులకు కేటాయించిన రెవెన్యూ బృందం విజయవాడకు బయలు దేరి వెళ్లింది.

డీసీసీ అధ్యక్షుడిగా చేవూరు దేవకుమార్‌రెడ్డి

- వరుసగా నాల్గవసారి ఎంపిక



చేవూరు దేవకుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా చేవూరు దేవకుమార్‌రెడ్డి వరసగా 4వ సారి నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా రఘువీరారెడ్డి, శైలజానాథ్, రుద్రరాజుల హయాంలో చేవూరు ఎన్నిక కాగా ప్రస్తుతం ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ఆధ్వర్యంలోనూ ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉడతా వెంకట్రావ్ యాదవ్‌తో పాటు పార్టీ నేతలు ఆదివారం చేవూరి నివాసానికి చేరుకుని ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి ప్రత్యేక కృషి చేస్తామని తెలియచేశారు.

దాతృత్వానికి విలువేది ?

- జీజీహెచ్‌లో రూ.80లక్షలతో డయాలసిస్ యూనిట్
- బయ్యా సరోజనమ్మ పేరుతో దాతల ఏర్పాటు
- గతనెల 9న మంత్రి సత్యకుమార్ ప్రారంభం
- ఇంకా అందుబాటులోకి రాని వైనం

నెల్లూరు(వైద్యం) సెప్టెంబరు 8: రూ. 80లక్షల వ్యయంతో నెల్లూరులోని జీజీహెచ్‌లో దాతలు ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ఇంకా వినియోగంలోకి రాలేదు. గతనెల 9న వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ దీన్ని ప్రారంభించారు. అన్ని ఏర్పాట్లతో ఆధునికంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్ నిర్వహణకు ఏటా రూ. 10 లక్షల ఖర్చు కూడా తామే భరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వైద్యులు, సిబ్బందిని మాత్రమే జీజీహెచ్ అధికారులు కేటాయిస్తే యూనిట్ అందుబాటులోకి వస్తుంది.

● టెక్నిషియన్లు ఉన్నా..

గతంలో జీజీహెచ్‌లో ఐదు పడకల డయాలసిస్ యూనిట్ ఉండగా, దీని నిర్వహణకు ఆరుగురు టెక్నీషియన్లను నియమించారు. వైద్యుల పర్యవేక్షణలో ఈ యూనిట్ పనిచేసేది. అయితే ఈ యూనిట్‌కు కేటాయించిన టెక్నీషియన్లను వేరే పనికి వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో దాతల సాయంతో ఏర్పాటుచేసిన

ఎంతకాలం వేచి ఉండాలి

జీజీహెచ్‌లో దాతలు రూ. 80 లక్షల ఖర్చుతో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. ఇదేమని అధికారులను అడిగితే ఇదిగో, అదిగో అంటున్నారు. ఇంకా ఆ యూనిట్‌కు ఏమేమి కావాలో సమకూర్చేందుకు కూడా దాతలు సిద్ధంగా ఉన్నారు. వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు ఏమిటో అర్థం కావడంలేదు. వెంటనే ఆ యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

- కిషోర్‌కుమార్, లయన్స్ క్లబ్



నెల్లూరు జీజీహెచ్‌లోని ఆరు పడకల డయాలసిస్ యూనిట్

డయాలసిస్ యూనిట్‌ను వైద్య శాఖ మంత్రి స్వయం గా ప్రారంభించి నెల కావస్తున్నా నేటికి అందు బాటులోకి రాలేదంటే జీజీహెచ్‌లోని వైద్యాధికారుల తీరుపై దాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● మాతృమూర్తి పేరుతో ఏర్పాటు

జీజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్‌ను బయ్యా సరోనమ్మ పేరుతో ఆమె కుమారులు బయ్యా రవికుమార్, బయ్యా శ్రీనివాసులు ఏర్పాటు చేశారు. రూ. 80 లక్షల వ్యయంతో ఆరు పడకల యూనిట్‌ను ఏర్పాటు చేశారు. శుభమస్తు ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తఆధ్వర్యంలో ఈ విభాగం ఏర్పాటయింది. ఇక్కడ అవసరమైన సెంట్రల్ ఏసీ కోసం రూ. 3.91 లక్షలు వెచ్చించారు. అలాగే రూ. 4.39 లక్షల విలువైన 30 కిలో వాట్ల బ్యాటరీలను, ఇన్‌వర్టర్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాటర్ క్యూరింగ్ కోసం పెద్ద వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. డయాలసిస్‌లో ఏమైనా గుండె సమస్యలు ఎదు రైతే వెంటనే తగిన చికిత్సలు అందించేందుకు ఇక్కడ ప్రత్యేక యంత్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న ఈ డయాలసిస్ యూనిట్ వల్ల ఎంతో మంది రోగులకు ప్రయోజనం చేకూరనున్నది.

డక్కిలి వెలుగు కార్యాలయంలో ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

- సిబ్బంది ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ
- రూ.కోటికి పైగా స్వాహా
- 11 మందిని పాత్రధారులుగా తేల్చిన అధికారులు

డక్కిలి, సెప్టెంబరు 8: డక్కిలి మండల వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ కార్యాలయంలో పని చేస్తూ పేదలు, నిరక్షరాసుల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించి స్వాహా చేసిన వ్యవహారం ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఆ జిల్లా డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఈనెల 6వ తేదీన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

డక్కిలి వెలుగు కార్యాలయంలో రుణాల వివరాలు అందచేయాలని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్దల మునెయ్య వెలుగు సిబ్బందిని సమాచారం అడిగారు. ఇందుకు స్థానికంగా పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా సమాచారం ఇవ్వకుండా దాటవేశారు. దీంతో ఆయన సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించి వెలుగు కార్యాలయంలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై తిరుపతి డీఆర్‌డీఏ పీడీ డక్కిలి మండలంలోని వెలుగు కార్యాయంలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. ఈమేరకు మండలంలోని 27 పంచాయతీల్లో విచారణను పలు బృందాలు చేపట్టి నివేదికను తిరుపతి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. డక్కిలిలో వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న 11 మంది సిబ్బంది రూ.1,32,03,629 స్వాహా చేసినట్లు నిర్ధరించారు. ఇందులో విచారణ సాగుతున్న సమయంలో అక్రమాలకు పాల్పడ్డ సిబ్బంది నుంచి రూ .26,35,224 రికవరీ చేశారు. అయితే ఇంకా రూ. 1,05,68,407 వారి నుంచి రికవరీ చేయాల్సి వుంది. గతంలో డక్కిలి వెలుగు కార్యాలయంలో పనిచేసిన కె.వజ్రమ్మ, ఆర్. విజయమ్మ, జి. నాగూరమ్మ, ఏ. సురేఖ ఇప్పటికే సస్పెండ్‌కు గురి అయి ఉన్నారు. వీరితోపాటు ప్రస్తుతం మరో ఏడుగురిపై వేటు పడింది.



డక్కిలిలో వెలుగు కార్యాలయం

ఏపీఎం పోలమ్మ, సిసిలు ఎం. వెంకటేశ్వర్లు, కె.రత్నయ్య, పి.వెంకటరమణమ్మ, కె .మంజుల, వై.ఆదిలక్ష్మిని తాజాగా సస్పెండ్ చేస్తూ ఉమ్మడి నెల్లూరు జిల్లా పీడీ ఉత్తర్వులు జారీ చేశారు.

● సమాచారం అడిగితే నా పెనై కేసుపెట్టారు

వెలుగు కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై సమాచర హక్కు చట్టం కింద వివరాలు అడిగితే తనపై డక్కిలి పోలీసుస్టేషన్‌లో వెలుగు ఏపీఎం పోలమ్మ కేసు పెట్టారని ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ గద్దల మునెయ్య అన్నారు. వెలుగు సిబ్బంది స్వాహా చేసిన నిధులను రికవరీ చేయడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాక రైతు మిత్ర సంఘాల్లో కూడా నిధులు గోల్‌మాల్ అయ్యాయని, విచారణ చేపట్టాలని కోరారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



ఆత్మకూరు : పంటవీధిలో పూజలు అందుకుంటున్న గణనాథుడు



అనంతసాగరం: వినాయకుడి ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న యువత



సంగం: తులసి మొక్కలు పంపిణీ చేస్తున్న రాజరాజేశ్వరానందస్వామి

వైభవంగా చవితి వేడుకలు

ఆత్మకూరు, సెప్టెంబరు 8: నియోజకవర్గంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను జరుపుకుంటున్నారు. మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో 67విగ్రహాలు కొలువుతీరాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పంటవీధి, జేఆర్‌పేట ఎక్స్‌టెన్సన్ ఏరియా, తోటవీధి, నాగేంద్రపురం, యాదవ వీధి, పిడుగు రంగయ్యవీధి, అరుంధతీయపాళెం, ఎస్టీకాలనీ, చల్లావీధి, ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట, వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణ సమీపంలో, స్పార్క్ సిటీ, చాకలవీధి ప్రాంతాల్లో 34 విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సవంలో పాల్గొన్నారు.



ఏఎస్‌పేట : రాజవోలులో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏఎస్‌పేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శనివారం వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహంచారు. వాడవాడలా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. రాజవోలులో గత 30ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తుండడం తో ఈ ఏడాది కాశీ అన్నపూర్ణేశ్వరి విశ్వేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త చిట్టి మూరి వెంకటరెడ్డి సౌజన్యంలో ప్రత్యేకంగా 50కేజీల లడ్డూను తయారు చేయించారు. దాన్ని 3వ రోజు భక్తులకు అందజేస్తామన్నారు.

రక్తదానం శిబిరం

చిరమన గ్రామంలో తూర్పువీధి యూత్ సభ్యులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాజవోలు సొసైటీ మాజీ ఛైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక చవితి పండుగ రోజు యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

అనంతసాగరం: మండంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం అనంతసాగరం చెరువులో నిమజ్జనం కార్యక్రమానికి పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం, తిరుమలాపురం, అప్పసముదరం, బండగానిపల్లి, చెరువుపల్లి, శకునాల పల్లి, పుల్లాయపల్లి, కృష్ణంపల్లి తదితర గ్రామాలతో పాటు ఉదయగిరి పట్టణంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం నిర్వాహకులు ఉట్టి మహోత్సవంతో పాటు భక్తుల కోసం అన్నదానం చేపట్టారు.

దుత్తలూరు: మండలంలోని నందిపాడు, రెడ్లదిన్నె, నర్రవాడ, పాపంపల్లి, వెంకటంపేట, కొత్తపేట, ఏరుకొల్లు, బ్రహ్మేశ్వరం, రాచవారిపల్లి గ్రామాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుత్తలూరు గుంతబజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గుడ్లూరు: మండలంలో శనివారం వినాయక చవితి వేడు కలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గుడ్లూరు జెండాచెట్టు వద్ద గరుడ వాహనంపై ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమ భక్తులను ఆకట్టుకుంది. అలాగే రామాలయం వద్ద, సీఐటీయూ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఘననాథులకు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తూర్పువడ్డెర పాలెం, మిట్టపాలెం, ఎస్సీకాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కూడా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

- **లింగసముద్రం :** వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేశారు.
- **వలేటివారిపాలెం :** మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి కొలువుదీరాడు. భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు.

కావలి టౌన్: వినాయక చవితి వేడుకలు పట్టణంలో శనివారం వైభవంగా జరిగాయి. వాడవాడలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు చేస్తుండడంతో చవితి శోభ సంతరించించుకుంది. ప్రధాన కూడళ్లలో, వ్యాపార సముదాయాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. రాత్రి పూట ఆయా ప్రాంగణాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం నెలకొంది. ఉత్సవాలు నిర్వహించే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపా లంకణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలుగోళశాంభవి ఆలయ ప్రాం గణంలో భారీ వినాయక విగ్రహం ప్రత్యేక సెట్టింగులు ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో మూడోరోజు విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు.

కావలి రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలు, చలువ పందిళ్లలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కొత్తపల్లి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కోలాటం, అన్నసంతర్పణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బిట్రగుంట: బోగోలు యాదవపాలెంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రైల్వే రిటైర్డ్ ఉద్యోగి చిలకపాటి వెంకయ్య భవనమ్మ జ్ఞాపకార్థం మహాలక్ష్మమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ఆదివారం కావలి టౌన్ బీజేపీ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం ప్రారంభించారు. అలాగే బృందావన వీధిలోని స్వామి వారిని టీడీపీ ఇన్‌చార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, నేతలు గనిపినేని నాగరాజు దర్శించుకున్నారు. కొత్తూరులోని గణనాథుని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, ఎల్.సుధీర్‌బాబు దర్శించుకున్నారు.



ఉదయగిరి రూరల్ : దుత్తలూరులో జరిగిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంభం దంపతులను జ్ఞాపిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ

దగదర్తి (బిట్రగుంట): ఊచగుంటపాలెం, చౌటపుత్తేడు, తడకలూరు, పెద్దపుత్తేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడి దర్శించుకున్నారు. ఈయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, స్థానిక టీడీపీ నేతలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

కొండాపురం: అన్ని గ్రామాలలో భక్తులు మండపాలలో వినాయకుడిని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేసి భక్త లకు తీర్థప్రసాదాలను అందజేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. యువతకు పలురకాల ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



వలేటివారిపాలెం : పాలకేంద్రం వద్ద కొలువుదీరిన వినాయకుడు



లింగసముద్రంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం

అల్లూరు: మండలంలో వీధి వీధినా, వాడవాడలా శనివారం వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ప్రతి ఇంట గణపతి ప్రతిమలను ఉంచి ఉండ్రాళ్లు, పాయసాలను నైవేద్యంగా ఉంచారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

జలదంకి: వినాయక చవితిని పురస్కరించుకుని జలదంకిలో ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాదిగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. కేరింతల మధ్య ఉత్సాహాల మధ్య బండలాగుడు పోటీలు జరిగాయి. అంతకుముందు స్వామికి పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కలిగిరి: అన్ని గ్రామాలలో శని, ఆదివారాలలో వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాటు చేసుకున్న విగ్రహాల వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను దూరప్రాంతాలనుండి వచ్చిన వారు కుటుంబసభ్యులతో కలసి మండపాల వద్ద సంతోషంగా గడిపారు.

సంగం: మండలకేంద్రమైన సంగం రాళ్లచెలిక, శివాజీ సెంటర్, తిరుమనతిప్ప, వడ్డిపాళెం, ముత్తరాశిపాళెం, అంబేద్కర్ నగర్, సాయినగర్, కొత్తూరు, అదేవిధంగా పెరమన, సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం, ఎస్‌వీఆర్‌పురం, గాంధీజన సంఘం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉట్టి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. యువకులు ఉత్సాహంతో ఒకరికి ఒకరు రంగులు పూసుకున్నారు. రాళ్లచెలిక వీవర్స్ కాలనీ, శివాజీ సెంటర్‌లో వినాయకునికి అభిషేకాలు, హోమం, భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: పట్టణంలోని పలు మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరికుంటపాడు: వినాయకచవితి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాముూరుపల్లి, తొడుగుపల్లి గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూద న్‌రావు, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారా యణ పూజలు నిర్వహించారు. అలాగే కనియంపాడులోనూ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ పూజలు చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



వరికుంటపాడు: పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



బిట్రగుంట: గణేష్ విగ్రహం వద్ద కమిటీ సభ్యులతో టీడీపీ నేతలు

వరద బాధితులకు ఆర్థిక చేయూత



కాకర్లకు చెక్కు అందజేస్తున్న అశోక్‌చౌదరి

వరికుంటపాడు, సెప్టెంబరు 8: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు తూర్పురొంపిదొడ్ల సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి కుమారుడు అశోక్ చౌదరి తమవంతు చేయూత నిచ్చాడు. రూ.2లక్షల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును శనివారం శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు విజయవాడలోని అతిథిగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా కాకర్ల అతన్ని ప్రత్యేకంగా అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సందల్‌మాలి

ఏఎస్ పేట, సెప్టెంబరు 8: హజరత్ సయ్యద్ ఖాజ రహమతుల్లా నాయబ్‌రసూల్ సతీమణి హబీబా ఖాతూన్ (దొరసానమ్మ) గంధోత్సవంలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో సందల్‌మాలి కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగడా మహిళా భక్తులు దర్గాలోని అమ్మవారి సమాధికి గంధలేపనం చేశారు. పలు ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. దర్గా నుంచి నాగారఖాజ సెంటర్ వరకు భక్తులు బారులుదీరారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా ఈవో మహమ్మద్ హసేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ వేమారెడ్డి, మండల ఎస్ఐ సైదులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

గడ్డివాముల దగ్ధం

అంనతసాగరం, సెప్టెంబరు 8: పాతదేవరాయపల్లిలో శనివారం ముగ్గురు రైతులకు చెందిన వరి గడ్డివాములు దగ్ధమయ్యాయి. వీటి విలువ రూ.75 వేలు ఉన్నట్లు బాధితులు వాపోయారు. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని మంట లను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

సబ్సిడీ పేరుతో మోసపోవద్దు

అనంతసాగరం, సెప్టెంబరు 8: రైతులకు సబ్సిడీతో ట్రాక్టర్లు అందిస్తున్నట్లు సోషల్ మీడియా వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అలాంటి ప్రకటనలను నమ్మవద్దని అనంతసాగరం వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరికరాల పంపిణీ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న యాప్‌లు ఓపెన్ చేసే మీ బ్యాంకు ఖాతా నుంచి మోసగాళ్లు నగదు కాజేస్తారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి ఏదైన సందేహం వుంటే రైతు సేవా కేంద్రాల్లోని అధికారులను సంప్రదించాలన్నారు.

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, సెప్టెంబరు 8: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలకరించారు. తరువాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నిర్వాహకులు భక్తులు అధికసంఖ్యలో అన్నదానం చేశారు.

నందప్రసాద్‌రావు జీవితం ఆదర్శం

వింజమూరు, సెప్టెంబరు 8: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్, బ్రహ్మర్షి పితామహ పత్రిజీ ఆంతరంగిక కార్యదర్శి నందప్రసాద్‌రావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నాయుడుపేట సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జ్యోతి, గీత తెలిపారు. వింజమూరులోని శ్రీవేద వ్యాసా వశిష్ట పిరమిడద్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని సేవలతోనే మనిషి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా నందప్రసాద్‌కు నివాళులర్పించారు.

ఇన్‌చార్జిల పాలనకు మంగళం!

ఆత్మకూరు, సెప్టెంబరు 8: ఆత్మకూరు పంచాయతీరాజ్‌శాఖ సబ్‌డివిజన్ పరిధిలో నాలుగేళ్లుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. 2021 జూన్ 4వ తేదీన అప్పటి రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీఆర్ అధికారులు పనితీరుపై ఆగ్రహించి ఉమ్మడి బదిలీలకు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. అప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆత్మకూరుకు మాత్రమే రెగ్యులర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన అనంతరం ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో రెగ్యులర్ అధికారుల నియామకానికి రంగం సిద్ధం అయ్యింది. రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రెగ్యులర్ అధికారుల నియామకం జరిపి అభివృద్ధి పనులు వేగవంతం అయ్యే దిశగా దృష్టి సారించారు. త్వరలో పంచాయతీరాజ్‌శాఖలో రెగ్యులర్ అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆత్మకూరు పీఆర్ డీఈగా ఏడుకొండలు, మర్రిపాడు మండల ఏఈగా శ్రీనివాస్, అనంతసాగరం ఏఈగా శ్రీనివాసులరెడ్డి, సంగం ఏఈగా రామయ్య బదిలీపై రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. చేజర్ల, ఏఎస్‌పేట మండలాల ఏఈ నియామకం ఒక కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది. అదే క్రమంలో పీఐయూ డీఈగా సుధాకరయ్య, ఏఈలుగా మల్లికార్జునరావు, మవేకొరెడ్డిలు బదిలీపై ఆత్మకూరుకు రానున్నట్లు తెలిసింది.

విగ్రహాల ఏర్పాటుకు మన్నేటి చేయూత



నగదు అందజేస్తున్న మన ఫౌండేషన్ సభ్యులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 8: కొండాయపాళెం, తిరుమలాపురం పంచాయతీలతో పాటు ఉదయగిరి పట్టణంలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ ఛైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి చేయూతనందించారు. శనివారం గంగిరెడ్డిపల్లిలోని తన నివాసంలో ఫౌండేషన్ సభ్యులతో వారికి రూ.5నుంచి రూ.10వేలు అందజేశారు. అలాగే పట్టణంలోని యాదవపాళెంలో అన్నదాన కార్య క్రమానికి రూ.25వేలు చొప్పున రూ.1.50లక్షలను ఇప్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు గాజుల రంతుజానీ, భోగ్యం శ్రీనివాసులు, అర్షద్, బాబు, లక్ష్మయ్య, రామయ్య, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన




సూచనలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం, సెప్టెంబరు 8: స్థానిక బ్యారేజీ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను ఆ త్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆదివారం పరిశీలించారు. చెరువులు, కాలువల్లో నీరు లేకపోవడంతో సంగం చుట్టుపక్కల గ్రామాల విగ్రహాలతో పాటు ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల నుంచి విగ్రహాలు బ్యారేజీ వద్దకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సీఐ వేమారెడ్డికి సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ గంగాధర్ ఉన్నారు.

కడనూతల చెరువుకు జలకళ : గ్రామస్థుల హర్షం

బిట్రగుంట, సెప్టెంబరు 8: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ పరిధిలోని కడనూతల చెరువుకు శనివారం నీటి విడుదలతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఆగస్టు 20వ తేదీ నుంచి చెరువు ఎండిపోతుందని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో పాటు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మండల నేతల కృషి ఫలితమే ఇది అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆంధ్రజ్యోతి దినపత్రిక యాజమాన్యానికి, టీడీపీ నేతలకు రైతులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



ఘనంగా అంకమ్మ ఆలయ వార్షికోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, ఎమ్మెల్సీ

కందుకూరు, సెప్టెంబరు 8: కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఉదయం జరిగిన అమ్మవారి అభిషేకం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు హాజరు కాగా ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్, కొడాలి కోటేశ్వరరావు, మేడా మలికార్జున, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8: మాలకొండ ఆలయలో జరుగుతున్న రిటైనింగ్ వాల్, కొండకింద నుండి కొండపైకి వెళ్లే మెట్లమార్గం పనులను వేగవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని ఆయన తన సతీమణి సౌజన్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం, కేశఖండన శాల, లడ్డుప్రసాదం కౌంటర్, దుకాణాలు, గోశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఎస్ఐ రాములు, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కామినేని అశోక్, శివయ్య పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,01,831

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 6,01,83 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 4,900, కుంకుమార్చన ద్వారా రూ. 18,960, తలనీలాలు ద్వారా రూ. 21,275, వాహన పూజలు ద్వారా రూ. 2,880, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,14,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 320, రూముఅద్దెలు ద్వారా రూ. 12,990, కవర్లు ద్వారా రూ. 4,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,47,825, అన్నదానం ద్వారా రూ. 2,69,265, విరాళముల ద్వారా రూ. 5,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు.


వరద బాధితుల కోసం విరాళాలు

కందుకూరు: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఆదివారం పలువురు దాతలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వరద బాధితుల సహాయార్థం విరాళాలను అందించారు. కందుకూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ట్రస్టు తరపున రూ. 25వేలు, కందుకూరు మున్సిపాలిటీలోని కాంట్రాక్టర్లు రూ. లక్ష, పట్టణంలో ప్రణవి చిన్నపిల్లలు, కంటి హాస్పటల్ నిర్వాహకులు డాక్టరు కె నవీన్‌కుమార్, డాక్టరు ఎన్ ప్రశాంతిలు రూ. 50వేలు విరాళంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కందుకూరు ఆర్టీసీ డిపోకు కేటాయించిన మూడు సూపర్‌లగ్జరీ నూతన బస్సులను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా బస్సును నడిపారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక టీడీపీ నేతలతో కలిసి పట్టణంలో నూతన బస్సులలో ప్రధాన వీధులలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు డిపోకు లాభాలు వచ్చేలా అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని, అవకాశం ఉన్న మేరకు ప్రజల సౌకర్యార్థం గ్రామీణ రూట్లలో బస్సులు నడపాలని డిపో అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపోలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జి మేనేజరు శ్రీనివాసరావు, సీఐ ప్రసాదు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, సవిడిబోయిన వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపూడి సర్పంచిపై కేసు నమోదు



టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్న సర్పంచి అనుచరులు

ఉలవపాడు, సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను సర్పంచ్ దగ్గరుండి తన అనుచరులతో దౌర్జన్యంగా తొలగించారని అందిన ఫిర్యాదుతో శనివారం సర్పంచ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బద్దిపూడికి చెందిన టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు వినాయక చవితి సందర్భంగా గ్రామంలో కొత్తూరు బస్టాండ్, వడ్డెరపాలెం వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. కాగా, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గ్రామస్థులకు పండుగ శుభాకాంలు తెలుపుతున్న ఫ్లెక్సీలను పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ కూనం అనిల్‌కుమార్‌రెడ్డి తన అనుచరులు తన్నీరు కొండయ్య, కందుల నాగరాజు, తన్నీరు మలికార్జున, తన్నీరు దుర్గారావు, తన్నీరు దుర్గా ప్రసాద్‌లతో అక్కడకు చేరుకున్నారు. గ్రామంలో తనకు తెలియకుండా, తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టడానికి మీరెవరంటూ నిర్వాహకులతో వాదనలు పెట్టుకున్నారు. సర్పంచ్ దగ్గరుండి తన అనుచరులను పురమాయించి ఫ్లెక్సీలను చించేసి పక్కన పడేశారు. దీంతో తన్నీరు అంకమ్మరాజు గ్రామస్థులతో కలిసి చేసిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ అనీకుమార్‌రెడ్డితోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినుట్లు ఎస్సై తెలిపారు.

కావాలనే డిప్యూటీ సీఎం ఫ్లెక్సీని తొలగించారు

అల్లూరు, సెప్టెంబరు 8 : తమ అభిమాన నాయకుడు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తొలగించి తమ మనోభావాలను దెబ్బతీశారని దెబ్బతీశారని అల్లూరు బలిజకాపులు మండిపడ్డారు. ఈ విషయంపై ఆదివారం సాయంత్రం బలిజపాలెం వీధిలోని విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి శీనయ్య, పసుపులేటి వెంకట కృష్ణయ్య, బండ్ల శ్రీనివాసులు, కుంచాల శేషగిరి రావు, మంగిశెట్టి సురేష్, సాయి, స్థానిక యువకుకలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8: జాతీయ రహదారి దాటుతుండగా మోటారుబైకును కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రమాదంలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామానికి చెందిన ఎస్ పెద్దిరెడ్డి, అచ్చుతలకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దిరెడ్డి, అచ్చుత మోటారుబైకుపై తిమ్మపాలెం నుండి వలేటివారిపాలెం వస్తుండగా ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణకు 17న ప్రత్యేక బస్సు

కందుకూరు, సెప్టెంబరు 8: పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణ కోసం కందుకూరు డిపో నుంచి ఈనెల 17న ప్రత్యేక బస్సు ఏర్పాటుచేస్తున్నట్లు డిపో ఇన్‌చార్జి మేనేజరు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని రూ. 2100 టిక్కెట్‌తో గిరిప్రదక్షిణతో పాటు కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని రావచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు 7382889870 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పొరపొచ్చాలకు తావివ్వొద్దు: ఎమ్మెల్యే



కావలి: బ్రిడ్జి సెంటర్ మండపం వద్ద ఎమ్మెల్యే

కావలి, సెప్టెంబరు8: భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారో అంతే భక్తిశ్రద్ధలతో పొరపొచ్చాలు, ప్రమాదాలకు తావులేకుండా విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం చేపట్టాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శని, ఆదివారం పట్టణంలోని పలు వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను తరలించే ట్రాక్టర్ల డ్రైవర్లతో పాటు వారి వెంట వెళ్లే వాహనదారులు ఎవరు కూడా మద్యం సేవించకుండా వాహనాలు నడిపేట్లు చూడాలన్నారు. అనంతరం స్థానిక ముసునూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే నియోజక వర్గంలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల నిమజ్జనంను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఒకటో పట్టణ సీఐ ఎండీ ఫిరోజ్, రూరల్ సీఐ రాజేశ్వరరావు, సీఐ పాపారావు ఉన్నారు.

ప్రైవేటు వైద్యశాల ప్రారంభం

కలిగిరి, సెప్టెంబరు 8: స్థానిక కావలి మార్గంలో నూతనంగా నిర్మించిన ప్రైవేటు వైద్యశాలను ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో పూర్తిస్థాయి వసతులు కలిగిన హాస్పిటల్‌ను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

కొండాపురం, సెప్టెంబరు 8: చింతలదీవి, తూర్పు ఎర్రబల్లి, గరిమెనపెంట, సాయిపేటలో ఆదివారం ఉపాధి పనులపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీలో భాగంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిగ్రామంలో కూలీలు ఊరిలో లేనప్పటికీ మస్టర్లు వేసుకొని నగదు డ్రా చేసి ఉండటం, కొలతలలో వ్యత్యాసాలను సిబ్బంది తనిఖీలో గుర్తించారు. పనిచేయనివారికి ఎక్కువ కూలీ రావడం, పనిచేస్తున్న వారికి తక్కువ కూలీ వస్తుందని సాయిపేటలో పలువురు ఉపాధి కూలీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొనడంతో గ్రామసభను ముగించారు. కార్యక్రమంలో ఏపీవో చెంచయ్య, ఎస్‌ఆర్‌పీ నీలకంఠం, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా వినాయకుడికి పూజలు


బుచ్చిలోని దేవాంగవీధిలో వినాయకుడికి పూజలు నిర్వహించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్నిగ్రామాలలో వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బుచ్చిలోని రామకృష్ణానగర్, సుహాసినీనగర్, సుబ్బారెడ్డినగర్, ఇస్కపాళెం, జొన్నవాడ సెంటర్, దేవాంగవీధి, కాశీపాళెం, పెద్దూరు, జొన్నవాడ, పెనుబల్లి, మినగల్లు, పంచేడు, రేబాల, దామరమడుగు, శ్రీరంగరాజపురం, నాగమాంబాపురం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. జొన్నవాడ సెంటర్ తదితర ప్రాంతాల్లోని విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేశారు. బుచ్చిలోని సుహాసినినగర్‌లో టీడీపీ యువనేత కిషోర్, ఇస్కపాళెంలో స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన విగ్రహాలకు జరిగిన పూజల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. జొన్నవాడ ఆలయంలో శనివారం రాత్రి వినాయకుడి గ్రామోత్సవం నిర్వహించారు. బుచ్చిలోని చెన్నూరురోడ్డులో గ్రామోత్సవం నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెంలోని దేవాంగవీధిలో నెలకొల్పిన వినాయకుడి విగ్రహానికి శనివారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. వారి వెంట నాయకులు ఎంపీ శేషయ్య, హరికృష్ణ, కౌన్సిలర్ వైష్ణవి, తాళ్ళస్వామి, వెంకయ్య, భువనేశ్వరం మురళి, హరనాథ్, రామానాయుడు, గుత్తా శ్రీనివాసులు కత్తిమహేష్, కిషోర్, కోదండరామిరెడ్డి, ప్రభాకర్, కాసా శ్రీనివాసులు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేట: అన్నదానం చేస్తున్న వీరేంద్రనాయుడు

●**ఇందుకూరుపేట:** మండలంలోని కుడితిపాలెం, పల్లిపాలెంలో ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవాలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఇందుకూరుపేట మండల కన్వీనర్ రావిలా వీరేంద్రనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అప్పని శ్రీనివాసులు, మెట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌కె ఇస్మాయిల్, కోదండరామిరెడ్డి, వలిమూడి చెన్నయ్య, పాల్గొన్నారు.

●**పొదలకూరు:** వినాయక చవితి పండుగను మండల వాసులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఏకదంతుని మండపాలతో ఊరూవాడా కోలాహలంగా మారింది. మండలంలో వివిధ రూపాల్లో రూపుదిద్దుకున్న గణనాధుని విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పిస్తున్నారు. పొదలకూరు పట్టణంలోని రామమందిరం వద్ద కొలువైన వినాయక మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక సెట్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు పొదలకూరు ఆకర్షణగా నిలిచారు. రామ్‌నగర్‌గేట్ సెంటర్ కూడలిలో హంస వాహనంపై నిల్చుని విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. అగచాట్లపురంలో కాశీవిశ్వేశ్వరుడుతో కూడిన విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. తొగట వీధిలో నందివాహనంపై వినాయకుడు భక్తులకు అభయమిస్తున్నాడు. వినాయక మాన్యం ఏరియాలో కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వరస్వామితో కలిసిన విఘ్నేశ్వరుడు భక్తుల కోరికలను నెరవేరుస్తున్నట్లు వున్నారు. పుట్టాయగుంటలో పుట్టలో ఉన్న విఘ్నేశ్వరునికి గోవు పాలు పోస్తున్నట్లుగా ఏర్పాటుచేశారు. బాలాజీనగర్ మొదటి వీధిలోని వినాయకుడు అయోధ్య బాలరాముని రూపంలో భక్తు లకు దర్శనమిస్తున్నారు. నరసారెడ్డి కాలనీలోని బాల రూపంలోని భారీ బాలవినాయకుడిగా భక్తులను ఆకట్టుకుంటున్నాడు. స్వామికి పూజల నిర్వహిస్తున్నారు.

●**తోటపల్లిగూడూరు:** మండలంలోని గ్రామాల్లో శనివారం వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించారు. గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకర్షణగా నిలిచాయి. ఆయా మండపాల వద్ద భక్తులు వినాయకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు. ముంగలదొరువు గ్రామంలో వినా యక స్వామి ఆలయం నిర్వాహకులచే ప్రత్యేక సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ వీరేంద్రబాబు పర్య వేక్షణలో గ్రామాలలో వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.

●**సైదాపురం:** మండలంలోని గ్రామాల్లో వాడవాడలా వినాయక చవితి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ప్రతిమలను మండపాల వద్ద ఏర్పాటు విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మండపాల వద్ద చిందులు వేస్తూ ఆనందోత్సవాలతో ఉట్టి కొట్టారు. ఆదివారం పలు చోట్ల వినాయక ప్రతిమలను నిమజ్జనంకు తరలించారు. డప్పుల వాయిద్యాలతో గణపతి బొప్పా బోరియా అంటూ యువకులు కేరింతలు కొట్టారు.

●**రాపూరు:** పట్టణంలో గణేష్ ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సిద్దలయ్య సెంటర్, కొత్తపేట, లక్ష్మీపురం మొదలగు అనేక వీధులలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి ఉట్టి కార్యక్రమం, అన్నదానం, ఉభయ కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. సోమవారం నిమజ్జనంలో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వీఆర్‌వో శ్రీనువాసులు

మనుబోలు, సెప్టెంబరు 8: మండలంలోని బద్దెవోలు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కొమ్మి మోహన్ శనివారం ప్రమాదవశాత్తూ పల్లిపాళెం సమీపంలో కాలువలో జారిపడి మృతిచెందాడు. దీంతో తహసీల్దార్ సుబ్బయ్య ఆదేశాలతో ఆదివారం వీఆర్‌వో శ్రీనివాసులు, మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రమేష్ రూ. 15వేలు మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

గడ్డివామి దగ్ధం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మనుబోలు, సెప్టెంబరు 8: మండలంలోని పిడూరు గ్రామంలో మిక్స్‌డ్ కాలనీలో వలిపి మునిస్వామి అనే పాడిరైతుకు చెందిన గడ్డివామిపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పువేయడంతో దగ్ధంమైంది. గూడూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదం వలన రూ. లక్షా 20వేలు మేర ఆస్తినష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. గ్రామ ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకురెడ్డి, టీడీపీ నాయకులు మానుగుంట సుధాకర్‌రెడ్డి, లాయర్ కృష్ణయ్యలు రైతును పరామర్శించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


సీఐగా బాధ్యతలు చేపట్టిన రవినాయక్

ముత్తుకూరు, సెప్టెంబరు 8: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కృష్ణపట్నం సీఐ రవి నాయక్ తెలిపారు. కృష్ణపట్నం సీఐగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ట్రాఫిక్, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామోత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. తనకు మండల ప్రజలు, నాయకులు సహకారం అందించాలని కోరారు.

ప్రశాంతంగా గ్రామోత్సవాలు నిర్వహించుకోవాలి : సీఐ


గణపతి మండపాలను పరిశీలిస్తున్న సీఐ రాంబాబు, ఎస్‌ఐ రాకేష్

మనుబోలు, సెప్టెంబరు 8: ఎలాంటి అల్లర్లు, గొడవలు లేకుండా ప్రశాంతంగా గ్రామోత్సవాలు నిర్వహించుకోవాలని పొదలకూరు సీఐ రాంబాబు నిర్వాహకులకు సూచించారు. మండలంలోని మనుబోలు, బద్దెవోలుతో పాటు పలు గ్రామాల్లోని గణేష్ మండపాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలీసుల నుంచి అనుమతులు తీసుకున్నారా, వాటిని మండపాల్లో ప్రదర్శించారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీసు నిబంధనల మేరకు మండపాల వద్ద కార్యక్రమాలు నిర్వహించాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాకేష్, ఏఎస్‌ఐ తిరుపాలు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 8 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణా రాష్ట్ర తొలి శాసనసభ స్పీకర్, శాసనమండలి ఫ్లోర్‌లీడర్ సిరికొండ మధుసూదన్‌చారి పాల్గొన్నారు. ముందుగా మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు ఖాదీవస్త్రాలు, నూలు మాలలు, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, గంపల మంజుల, కందికట్టు రాజేశ్వరి ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆశ్రమంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి ఏఎస్సై, కానిస్టేబుల్ ఆకస్మిక బదిలీ

● పోలీసుల్లో కలకలం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8: స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏఎస్సై, కానిస్టేబుల్ ఆకస్మిక బదిలీలు పోలీసుల్లో కలకలం రేపింది. శుక్రవారం రాత్రి బుచ్చి సీఐ శ్రీనివాసులు రెడ్డికి ఎస్పీ కృష్ణకాంత్ ఫోన్‌చేసి ఏఎస్‌ఐ షేక్ జాకీర్, కానిస్టేబుల్ సతీష్‌ల బదిలీలకు ఆదేశించారు. వెంటనే సీఐ వారిద్దరికి పాస్‌పోర్టు కూడా ఇచ్చేశారు. ఏఎస్సై జాకీర్‌ను సంగం పీఎస్‌కు, కానిస్టేబుల్ సతీష్‌ను ఆత్మకూరు పీఎస్‌కు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఆకస్మికంగా ఇద్దరినీ బదిలీ చేయడానికి గల కారణాలపై ఆరాతీసినా అంతుచిక్కలేదు. మొత్తానికి ఈ బదిలీలు పోలీసుల్లో గుబులు రేపింది.

లాడ్జిలో వ్యక్తి మృతి


మృతిచెందిన రామాంజనేయులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8: లాడ్జిలో వ్యక్తి మృతి చెందిన ఘటన సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల జల్లా ఆత్మకూరు మండలం సున్నిపెంటకు చెందిన కె రామాంజనేయులు(44) ఏడాదిగా నెల్లూరు నగరంలోని ఏటి ఆగ్రహారంలో శ్రీధనలక్ష్మి లాడ్జిలో ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేది ఆయన లాడ్జీలో ఫోన్‌లో మాట్లాడుతూ మెట్ల వద్ద కుప్ప కూలిపోయారు. ఈ విషయాన్ని గమనించిన లాడ్జీ సిబ్బంది 108కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది రామాంజనేయులను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు లాడ్జీ మేనేజర్ మస్తానయ్య సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు కాలువల ఆక్రమణ

● దుర్గంధంతో ప్రజల అవస్థలు

● పట్టించుకోని పాలకులు, అధికారులు


సుబ్బారెడ్డి నగర్‌లో రోడ్డుపై మురగు నీరు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8: మురుగు కాలువలు ఆక్రమణకు గురై నీరు రోడ్లమీదకు చేరి దుర్గధం వెదజల్లుతుండడంతో అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని జాతీయ రహదారిపై గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రభుత్వ పశు వైద్యశాల, నాయుడు కాంప్లెక్స్ దగ్గర్నుంచి ఇరిగేషన్ బంగ్లా వెంబడి పంచేడు రోడ్డు వరకు కాలువలు ఆక్రమణకు గురై మురుగుపోయే మార్గం లేక దుర్గంధం వెదజల్లుతోంది. నాయుడు కాంప్లెక్స్ నుంచి పంచేడు మార్గం సమీపంలోని ఛాయ్‌దర్బార్ వరకు మురుగు దుస్థితిపై మూడేళ్లనుంచి మొరపెట్టుకుంటున్నా నగర పంచాయతీ పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ఆప్రాంత ప్రజలు, వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


సుబ్బారెడ్డినగర్‌లో మురుగు తంటాలు

పట్టణంలోని ఇరిగేషన్ బంగ్లా వెనుక ప్రాంతంలోని సుబ్బారెడ్డినగర్‌లో బాగున్న డ్రైన్లు పగలగొట్టి నిర్మించిన కొత్త డ్రైనేజీ కాలువలతో ప్రయోజనం లేకపోగా ఆ కాలువల్లో మురుగునీరంతా రోడ్లమీదకు చేరి దుర్గధం వెదజల్లుతుండడంతో వ్యాధులకు గురవుతున్నామని ఆ ప్రాంతంలోని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుకన్నా రెండు అడుగుల ఎత్తులో కాలువలు నిర్మించడంతో మురుగు కాలువలో నీరు రోడ్డుపై చేరి అందులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని, దీనికితోడు దోమల బెడద తీవ్రమై వ్యాధులకు గురవుతున్నామని, నగర పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లోని మురుగునీరు రోడ్డుమీదకు రాకుండా చర్యలు చేపట్టి వ్యాధుల బారినుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వక్రతుండ మహాకాయం..

కోటి సూర్య సమప్రభం

● వైభవంగా వినాయక చవితి వేడుకలు


రేబాలవారివీధిలో లక్ష ముత్యాలతో గణపతి విగ్రహం


మినీబైపాస్‌లో లంబోదరుడు


శబరిశ్రీరామ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8 : బొజ్జగణపయ్య నీ బంటు నేనయ్య అంటూ నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో శనివారం వినాయక చవతి వేడుకలను జరుపుకున్నారు. నగరంలో చిన్నా పెద్దా కలిపి వెయ్యి గణేష్ మండపాలు వద్ద వినాయక చవితి వేడుకలు జరిగాయి. మాగుంట లే అవుట్‌లో లంబోదర సెంటర్‌లో వినాయక చతుర్ధి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తంజావూరు శిల్పకళ ఉట్టి పడేలా భారీ సెట్టింగ్ వేశారు. ఇక్కడ గరుడ వాహనంపై వినాయకుడితోపాటు దశావతారాల అలంకారాలు అలరించాయి. లంబోదర వినాయక కమిటీ, కార్పొరేటర్ నూకరాజు మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి పూజలలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, సయ్యద్ సమీ పాల్గొన్నారు.

● 17వ డివిజన్ ఆకుతోటలో వీపీఆర్ యువసేన అధ్యక్షుడు, నెల్లూరు హబ్ నిర్వాహకుడు అరవిందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని వేమిరెడ్డి దంపతులు ప్రారంభించి తొలి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

● జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● జేమ్స్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ వినాయక చవితి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దార్ల వెంకటేశ్వర్లు, కలికి శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఆర్ ఇంతియాజ్, షేక్.షైనుద్దీన్, గోగుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● రేబాలవారివీధి పీటీజీ రాజ్ టవర్స్‌లో లక్ష ముత్యాలతో తయారు చేసిన ముత్యాల గణపతిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

● ట్రంకురోడ్డు, శివాజీ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన గణేషునికి ఎంపీ వేమిరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి ఉత్సవ కమిటీ శివాజీ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

● బాలాజీనగర్ లక్కీబోర్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ కార్పొరేటర్ కోటంరెడ్డి సంధ్యలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తానే మస్తాన్, అఖిల్, చందు, తదితరులు పాల్గొన్నారు.

● నవాబుపేట లక్ష్మీపురంలో జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లక్ష్మీపురం యూత్ వినాయక ప్రతిమను ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు.

● సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద కాలుష్య రహితంగా తీపి గణపతి విగ్రహం ఏర్పాటు చేశారు. గోదావరి జిల్లా ఆత్రేయపురం నుంచి పూతరేకులు తెప్పించి మహాగణపతిని రూపొందించారు. ఈ విగ్రహంకు సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు కుటుంబం, రాజీయాడ్స్ పెంచలయ్య పూజలు చేశారు.

● నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రంగనాయకులపేట, సంతపేట, తదితర సెంటర్స్‌లో యువత భారీ గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. చవితి రోజు ఘనంగా పూజలు చేశారు. కాపువీధి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతికి, ఆనం కుటుంబ సభ్యులు, కాపువీధి మిత్ర మండలి సభ్యులు పూజలు నిర్వహించి భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు.

● ట్రంకు శివాజీ సెంటర్‌లో శివాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో భారీ గణపతిని ఏర్పాటు చేశారు. ఎంపీ వేమిరెడ్డి దంపతులు, విక్రమ సింహపురి గణేష్ సేవా సమితి నాయకులు పాల్గొని వినాయక చవితి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.సురేంద్రరెడ్డి, పిట్టి సత్యనాగేశ్వరరావు, బయ్యా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● మండపాలవీధి, కాకర్లవారివీధి, చిన్నబజార్, విరాట్‌నగర్, కుక్కలగుంట, కామాటి వీధి, రాజేంద్రనగర్‌లలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● చిన్నబజారు రాజాప్రతాప్ సెంటర్‌లో భారతీయత ఉట్టి పడేలా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని పూజలు చేశారు.

● పెద్దబజారు మహబూబ్‌ఖాన్ పార్కు, పాత జడ్పీ సెంటర్, ఆచారి వీధి, మూలాపేట, కోనేటి మిట్ట, వేణుగోపాలస్వామి ఆలయం, రాజాగారివీధి, బ్రాహ్మణ వీధిలలో గణేష్ విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

● శబరి శ్రీరామక్షేత్రంలో భారీ గణేష్ విగ్రహం ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు, రామ్‌నగర్ మిత్రమండలి సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా చవితి పూజలు జరిగాయి. భక్తులకు ప్రసాదాల పంపిణీ జరిగింది.

● పత్తేఖాన్‌పేట, టెక్కెమిట్టలతోపాటు క్రాంతినగర్ శివకేశవులు ఆలయం వద్ద గణేష్ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక ప్రముఖులు పాల్గొని వినాయక చవితి పూజలు చేశారు.

● పొదలకూరురోడ్డు గాంధీనగర్, రామకోటయ్యనగర్, పోలీస్ కాలనీ, కావేరినగర్, కొత్తూరు, హెచ్‌కెబాబునగర్, శ్రామికనగర్, వైఎస్సార్ కాలనీ, బుజబుజనెల్లూరు తదితర సెంటర్స్‌లో పూజలు ఘనంగా జరిగాయి.

● నగరంలోని క్రాంతినగర్ కొండా బలరామిరెడ్డి వీధిలోని శివకేశవులు దేవస్థానంలో ఏర్పాటు చేసిన పంచముఖ గణపతికి విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భార్గవి ఆటోమొబైల్స్ చైర్మన్ కొండా బలరామిరెడ్డి, రాధిక దంపతులు తొలిపూజ చేశారు. గణేష్ ఉత్సవాల్లో డాక్టర్లు అనపల్లి సన్నీష్‌రెడ్డి, నిషిషాతారెడ్డి, కొండా ఈశ్వర్‌రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, అనపల్లి మస్తాన్‌రెడ్డి, మల్లికార్జున్‌రావు, పునుగోటి లోకనాథం పాల్గొన్నారు.

● నగరంలోని పప్పులవీధి సిద్ధివినాయక స్వామి చవితి ఉత్సవాలలో భాగంగా ఉదయం గరికపూజ ఘనంగా జరిగింది. గణపతిపూజ, రాత్రి పాటకచ్చేరి భక్తులను అలరింప చేసింది. అనంతరం లడ్డూ వేలం పాట జరిగింది.

● నగరంలోని పురమందిరంలో జ్యోతి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నయి. ఆదివారం ఉదయం మూలవర్లుకు వెన్న అలంకారం, విశేష పూజలు అనంతరం స్వామివారికి హంస వాహనంలో నగరోత్సవం వైభవంగా జరిగింది.

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

నెల్లూరురూరల్ : నెల్లూరురూరల్లోని వాడవాడల గణపతులు కొలువుదీరారు. విఘ్నేశ్వర విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించిన పూజలు నిర్వహించారు. పోటాపోటీలుగా గణపతుల విగ్రహాలను వివిధ ఆకారాలలో ఏర్పాటు చేసిన నిర్వహణ కమిటీలు అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో గతంలో ప్రధాన కూడళ్లకే గణపతులను పరిమితం చేసిన యువత ఈ సారి కాలనీలు, పాళెంలు, వీధుల్లో ప్రత్యేక ఆకర్షణలతో ఏర్పాటు చేయడం ఆకట్టుకుంది.

వెంకటేశ్వరపురం కూడలిలో...


పూజలు చేస్తున్న మండవ రామయ్య, మిత్రమండలి సభ్యులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం): వెంకటేశ్వరపురంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు భారీ గణపతులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. వెంకటేశ్వరపురం కూడలిలోని పాత పెట్రోల్ బుంకు ప్రాంతంలో భారీ బొజ్జగణపయ్యను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకుడు మండవ రామయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు శివకుమార్, నరసింహ, సందీప్, మోహన్, సుబ్బారావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి సీఎం అభినందన



వేమిరెడ్డికి సీఎం చంద్రబాబు రాసిన లేఖ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8 : ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఆయనకు లేఖ రాశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందించిన సహాయం రాష్ట్ర పునరుద్ధరణకు ముఖ్యంగా వరద బాధితులకు ఎంతో మేలు చేస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటీవల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు చంద్రబాబును కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందచేసిన సంగతి తెలిసిందే.

వేమిరెడ్డిని కలిసిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ది నెల్లూరు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిసి శాలువాతో సన్మానించారు. తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా అసోసియేషన్‌కు సంబంధించి ప్రత్యేక భవనం ఏర్పాటుకు తమ వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, అయిత భాస్కర్, అశోక్, కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిందుమీనన్ ఫౌండేషన్‌కు కలెక్టర్ ప్రశంస

● నిరుపేద రోగులకు మందుల పంపిణీ


రోగులకు మందులు అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8 : డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రశంసించారు. ఆదివారం నగరంలోని రామూర్తి నగర్‌లో జరిగిన డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా న్యూరాలజీ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. డాక్టర్ బిందుమీనన్‌ను ఆదర్శంగా తీసుకుని వైద్యులు సొంత లాభం చూసుకోకుండా పేద రోగులకు తమవంతు సాయం చేయాలన్నారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ నరాలకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నరాల వ్యాధులకు ఉచిత చికిత్స, మందులు ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 250 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, 248 అవగాహన సదుస్సులు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నంబియార్, వైస్ చైర్మన్ భార్గవి నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అవగాహన

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 8 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ నిషితారెడ్డి షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో 7కోట్ల మంది షుగర్ వ్యాధిగ్రస్తులున్నారని, ప్రతి ఇంట్లో ఒకరికి షుగర్ వ్యాధి రావడం బాధాకరమన్నారు. కేవలం ఆహారపు అలవాట్లే దీనికి కారణమన్నారు. అనంతరం వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కె.జయదేవ్, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, సలహాదారులు చింతల అమరేంద్రరెడ్డి, సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర సత్యనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పార్కులతో ప్రజలకు ఆహ్లాదం : కోటంరెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, సెప్టెంబరు 8 : పార్కుల నిర్మాణంతో నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కలుగుతుందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహాత్మ గాంధీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కొంత సమయం సేదతీరేందుకు, ఆహ్లాదం పొందేందుకు పార్కులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. వ్యాయామంతో పాటు అన్ని సౌకర్యాలను పార్కుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

● రూరల్లోని 23వ డివిజన్ కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మాజీ కార్పొరేటర్ పాతపాటి పుల్లారెడ్డిలకు కండువా కప్పిన ఎమ్మెల్యే సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. స్థానిక నాయకులు, కార్యకర్తల ఇష్టంతోనే వైసీపీ నాయకులను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. రానున్న పంచాయతీ, కార్పొరేషన్ ఎన్నికల్లో నూటికి నూరుశాతం సీట్లు టీడీపీ గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8 : నగరంలోని మూలాపేట గురు నిలయంలో 42వ వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు సందర్భంగా ఆదివారం స్వామివారి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకుని నగర సంకీర్తనలతో బిక్షాటన చేశారు. సాయంత్రం భగవాన్ వెంకయ్య స్వామి జీవిత చరిత్రపై సత్సంగ కార్యక్రమం జరిగింది. సోమవారం వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


మొదలైన నిమజ్జన సందడి

జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే వినాయక ప్రతిమల నిమజ్జన సందడి మొదలైంది. తిరుపతి, పరిసర ప్రాంతాలవారు కొందరు తమ ఇళ్లలో పూజించిన, వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి గణేశుడి ప్రతిమలను తీసుకొచ్చి వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలోనూ బొజ్జగణపయ్య ప్రతిమల నిమజ్జన సందడి కనిపించింది.

- తిరుపతి (జీవకోన)



తిరుపతి వినాయకసాగర్ వద్ద భక్తులు, గణేశుడి ప్రతిమ నిమజ్జనం



వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలిస్తున్న యువత

58.5 కిలోల గంజాయి పట్టివేత

● వేర్వేరు ప్రాంతాల్లో బాలుడితోపాటు ఏడుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు


గూడూరు, సెప్టెంబరు 8: జిల్లాలో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖపట్నం నుంచి చెన్నైకి వెళుతున్న బస్సులో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న గుంటూరు జిల్లాకు చెందిన సంజయ్‌కుమార్, ఉమాశంకర్, నీలయ్యలను విచారించారు. విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో విక్రయిస్తున్నట్లు తేలిందని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

తిరుపతిలోనూ..

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8: తిరుపతిలోనూ శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తన సిబ్బందితో కలిసి కొర్లగుంటలో గంజాయి విక్రయిస్తున్న కందాటి సాయిచందు, ఆర్.దేవరాజన్, ఎస్.హరినాథ్ సింగ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగున్నర కిలోల గంజాయితో పాటు మత్తు బిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈస్ట్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, సిబ్బంది కలసి తనిఖీలు చేశారు. బొమ్మగుంటలో ఓ బాలుడి (17) వద్ద నుంచి 21 కిలోల గంజాయి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో..

వెంకటగిరి టౌన్: కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి తాలుకా విజయపురానికి చెందిన నరసింహరాజు స్టేషన్‌లో శనివారం అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. ఇతను ఒడిశా నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.



బార్లపై వచ్చే రా'బడి' మాదే

వైసీపీ నేతలకిచ్చినట్టు నెలకు రూ.20లక్షలు ఇవ్వాల్సిందే

లేకుంటే ఇబ్బందులు తప్పవు

బార్ల యజమానులతో పొరుగు నియోజకవర్గ నేత పంచాయితీ

తిరుపతిలో ఆయన పెత్తనమేంటని కూటమి నేతల మండిపాటు

తిరుపతి, ఆంధ్రజ్యోతి

'వైసీపీ ప్రభుత్వంలో నెలనెలా ఒక్కో బారుకు రూ.1.5లక్షల మామూళ్లు ఇచ్చారు కదా.. ఇప్పుడు కూడా అలా ఇవ్వాల్సిందే. కాదు.. కూడదంటే రైడింగ్‌లతో ఇబ్బందులు తప్పవు' అంటూ పొరుగు నియోజకవర్గానికి చెందిన ఓ యువ నేత తిరుపతిలోని బార్ల యజమానులకు అల్టిమేటం జారీ చేశారు. వైసీపీ నేతలకిచ్చినట్టు రూ.20లక్షలు ఇస్తే.. దాన్ని ఎవరెవరికి వ్వాలో తాము చూసుకుంటామని కూడా చెప్పుకొచ్చినట్టు తెలిసింది.

వాళ్లకిచ్చారు కదా.. మాకూ ఇవ్వండి..!

ఎన్నికల ముందు టీడీపీలో చేరిన పొరుగు నియోజకవర్గానికి చెందిన యువనేత.. తిరుపతిలో ఓ బార్ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, తిరుపతిలో ఆ పార్టీల నేతలు తలోదారిలో ఉండడంతో ఇక్కడ లిక్కర్ లీడర్‌గా అవతారమెత్తాడు. శుక్రవారం తన బారులోనే బార్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశాడు. 'సిండికేట్ వ్యాపారం చేసుకుందాం. ఏదైనా సమస్య వస్తే నేను చూసుకుంటా.. మీరేం భయపడవద్దు. అయితే గతంలో వైసీపీ నేతలకు ఏవిధంగా ఇస్తున్నారో, ఆ విధంగా మాకు కూడా ఇచ్చేయండి' అంటూ అక్రమ దందాకు తెరలేపినట్టు తెలియవచ్చింది. మరో బార్ యజమాని కుమారుడు ఇతనికి జతకట్టినట్టు తెలిసింది. 'జనసేన అభ్యర్థి గెలుపు కోసం రూ.2.5కోట్లు ఖర్చుపెట్టాను. 25వేల ఓట్లు నా వల్ల వైసీపీ నుంచి జనసేనకు టర్న్ చేశాను. పెద్దోళ్లతో మాట్లాడి అంతా సెట్ చేసే బాధ్యత మా ఇద్దరిదే' అని అతను చెప్పగానే ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవాల్సి వచ్చింది.

పోలీసులతో బెదరగొట్టించి దారిలోకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు ముగిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చే నెలవారీ మామూళ్లకు బ్రేక్ పడడంతో రూ.5లక్షల వరకు మిగిలిపోయాయని బార్ల యజమానులు సంతోషంలో ఉన్నారు. వారి ఆనందం మూడు నెలల ముచ్చటగానే మిగిలిపోయింది. గతంలో వైసీపీ నేతలకు మామూళ్లు ఇచ్చిన విషయాన్ని సదరు బార్ యజమాని ప్రజాప్రతినిధుల చెవిలో ఊదినట్టు తెలిసింది. 'అదేదో నువ్వే చూసుకో' అన్న సంకేతాలు రావడంతోనే సెటిల్మెంట్‌కు స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది. రెండు వారాలుగా బార్ల యజమానులను పోలీసు కేసులు పెట్టి వేధించడం మొదలుపెట్టారు. ఉదయం 10 గంటలకు బారు ఓపెన్ చేస్తే రాత్రి 11 గంటలకు క్లోజ్ చేయాలి. సమయపాలనలో తేడావస్తే కేసులు, రూ.10వేల వరకు ఫైన్ వేస్తూ వచ్చారు. దారిలోకొచ్చిన బారు యజమానులు ఓ డీఎస్పీ దగ్గరకు వెళ్లి వేడుకున్నారు. 'గత ప్రభుత్వంలో వలే ఇప్పుడు కుదరదని, నిబంధనలు పాటించి వ్యాపారం చేసుకోవాల్సిందే' అని సదరు పోలీస్ అధికారి ఖరాకండిగా చెప్పేశారు. ఏదైనా మార్గం ఉంటే చెప్పాలని బార్ల నిర్వాహకులు పదేపదే అభ్యర్థించడంతో.. 'అదేదో పెద్దోళ్లతో మాట్లాడుకోండి' అని ఓ ఉచిత సలహా పడేసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే బార్ల నిర్వాహకులు సమావేశమైనట్టు తెలిసింది. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే? గడిచిన మూడు నెలల వాటా కూడా సదరు లిక్కర్ లీడర్ డిమాండ్ చేసినట్టు సమాచారం.

గతంలో ఇలా..

తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 13 బార్లవరకు ఉన్నాయి. స్టార్ హోటళ్లలో మరో ఐదు వరకు ఉన్నాయి. ఇందులో రెండు, మూడు బార్లు కూటమి నేతలవి కాగా.. తక్కినవన్నీ వైసీపీ నేతలు, ఆపార్టీ సానుభూతిపరులవే ఉన్నాయి. అయినా గతంలో ప్రతినెలా ఒక్కో బారు నుంచి రూ.1.5లక్షలను గౌరవంగా కవర్లోపెట్టి ముట్టచెప్పేవారని సమాచారం. వైసీపీ నగర పార్టీలో చిరకాలంగా కీలక పదవిలో ఉంటూ మౌనంగా కనిపించే ఓ నాయకుడికి ఈ కలెక్షన్ బాధ్యతలను స్థానిక నాయకత్వం అప్పగించారన్న ప్రచారముంది. లిక్కర్ వ్యాపారంలో రాటుదేలిన సదరు నేత నెలకు రూ.20లక్షల వరకు వసూలు చేసి ముఖ్యులకు అందజేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి బాధ్యత తాము తీసుకుంటున్నట్టు సమావేశం నిర్వహించిన బారు యజయాని చెబుతున్నట్టు తెలిసింది. అక్టోబరు ఒకటో తేదీనుంచి నూతన మద్యం పాలసీ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో బార్ల ఆదాయం పడిపోనుందన్న ఆందోళన నిర్వాహకుల్లో లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో సెటిల్మెంట్ చేసుకోవాలా? వద్దా? అన్న గందరగోళంలో బార్ల యజమానులు పడ్డారు. ఇవన్నీ ఇలా ఉంటే.. పొరుగు నియోజకవర్గానికి చెందిన నాయకుడు ఇక్కడ పెత్తనం చేయడమేంటని కూటమి వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు సమాచారం.

చిచ్చురేపిన 'ర్యాష్ రైడింగ్'

● రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులతో పరిస్థితి ఉద్రిక్తం

● అడ్డుకోబోయిన ఎస్ఐకి స్వల్ప గాయం ● ఓ ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దం

కేవీబీపురం, సెప్టెంబరు 8: పక్క గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ గ్రామంలో ద్విచక్ర వాహనాలను ర్యాష్‌గా నడపడంపై స్థానిక మహిళలు ప్రశ్నించారు. దీనిపై మాటామాటా పెరిగి రెండు గ్రామాల మధ్య దాడులకు దారితీసి, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. కేవీబీపురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రాగిగుంటలో అతివేగంగా చక్కర్లు కొట్టారు. భయపడ్డ స్థానిక మహిళలు అడ్డుకోవడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. కాసేపటికి ఆ యువకులు అక్కడినుంచి వెళ్లి తమ గ్రామం సుమారు 30మందిని వెంటబెట్టుకొచ్చారు. దీంతో ఈ గొడవ కాస్తా రెండు గ్రామాల మధ్య పరస్పర దాడులకు దారితీసింది. ఆదివారం ఉదయం మళ్లీ పెరిందేశంవాసులు మళ్లీ రాగిగుంటకు చేరుకున్నారు. దుకాణాలను ధ్వంసం చేసి, పెరిందేశం గ్రామస్థులపై దాడికి దిగారు. దీంతో రెండు గ్రామాల వారు కొట్లాటకు తెగబడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవను అడ్డుకోబోయిన పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్ పైనా మద్యం సీసాలు విసరడంతో ఎడమ కన్ను వద్ద స్వల్ప గాయమైంది. మరోవైపు రాగిగుంటవాసులు పిచ్చాటూరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఏఎస్ఐ లోకనాథం అండతోనే పెరిందేశంవాసులు దాడి చేశారని ఆరోపించారు. ఈక్రమంలో గుర్తుతెలియని ఆందోళనకారులు అటుగా వచ్చిన శ్రీకాళహస్తి డిపోకి చెందిన బస్సు అద్దాన్నీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ రవి మనోహరాచారి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పలువురు సీఐలు, ఎస్ఐలతో ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపు చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఈ గొడవతో సంబంధం ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, రెండు గ్రామాల్లోనూ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

మామ అల్లుళ్లపై వేటుకు సన్నద్ధం

కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మామ అల్లుళ్లపై బదిలీ వేటుకు అధికారులు సన్నద్ధమైనట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రక్తసంబంధీకులు ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసేందుకు వీలుండదు. అయితే ఏఎస్ఐ.. రాజకీయ అండతో తన కుమార్తె భర్త అయిన కానిస్టేబుల్‌ను తాను పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు డీవోగా తెచ్చుకున్నారు. ఈ ఏఎస్ఐ పనిచేసినా ప్రతిచోటా అనేక ఆరోపణలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. నెల కిందట కానిస్టేబుల్ అయిన అల్లుడు ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకుని చెల్లించకపోగా, తప్పుడు కేసు పెడతానంటూ బెదిరించడంపై బాధితుడు 100కు ఫోన్ చేశాడు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి కొంత నగదు వసూలు చేయించిన ఘటన కూడా ఆదివారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. మరోవైపు ఈ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కూడా నియమించకుండా తానే చక్రం తిప్పుతున్నట్లు ఫిర్యాదు అందాయి. తాజాగా ఇదే ఏఎస్ఐ అండతోనే తమపై దాడి జరిగినట్లు రాగిగుంటవాసులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మామాఅల్లుళ్లను తిరుపతి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి రిపోర్టు చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.



నిరసన తెలుపుతున్న రాగిగుంట గ్రామస్తులు






యాగశాల పూజ నిర్వహిస్తున్న అర్చకులు - ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్

కాణిపాకంలో వైభవంగా ధ్వజారోహణం

● వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 8: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం చేశారు. ఆలయ అణివేటి మండపంలోని ధ్వజ స్తంభాన్ని అభిషేకించారు. అనుజ్ఞ, గణపతిపూజ, మృత్ సంగ్రహణం, వాస్తు శాంతి, నవసంధి బలి, పుణ్యాహవచనం, మూషిక యాగం, ధ్వజపటపూజ, ధ్వజ స్తంభ అభిషేకం, వాస్తుబలి, మహా హారతినిచ్చి 9-10 గంటల మధ్య స్వాతి నక్షత్రయుక్త శుభ తులా లగ్నంలో వేదమంత్రాల నడుమ మూషిక ధ్వజ పటాన్ని నింగికి ఎగుర వేశారు. దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలను కామికా ఆవాహన పద్ధతిలో నిర్వహిస్తారు. సాయంత్రం అర్చక, పండితులు యాగశాల ప్రవేశ పూజ నిర్వహించారు. యాగశాలలో ఈవో గురుప్రసాద్‌కు, అనంతరం ధ్వజస్తంభానికి, మూషికానికి అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్ రక్షా బంధనాన్ని కట్టారు. దీనివల్ల బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగవని ప్రజల నమ్మకం. రక్షా బంధనం కట్టున్న వ్యక్తి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఊరి పొలిమేర దాటి వెళ్లకూడదని నియమం.



హంస వాహనంపై లంబోదరుడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామికి హంస వాహన సేవ జరిగింది. ఉదయం మూల విరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శ్రీకరుణీక వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను హంస వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌గా రాఘవేంద్రమీనా బాధ్యతల స్వీకరణ



గూడూరు, సెప్టెంబరు 8: గూడూరు సబ్‌కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను బదిలీ చేయడంతో ఆయన స్థానంలో రాఘవేంద్రమీనా బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వహించి గూడూరు సబ్‌కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్‌ను స్వీకరించారు.

దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

గూడూరు, సెప్టెంబరు 8: వరద బాధితులను ఆదుకునేందుకు పట్టణంలోని పలువురు ముందుకు వచ్చి సీఎం సహాయనిధికి నిధులు అందజేస్తూ దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక గ్రూప్ థియేటర్‌లో బలిజ అభ్యుదయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చదలవాడ హరిప్రసాద్ సహకారంతో సీఎం సహాయనిధికి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. వరద బాధితులకు తన సొంతనిధులు రూ.5లక్షల విలువైన దుప్పట్లను సోమవారం సీఎం చంద్రబాబు సమక్షంలో విజయవాడలో అందజేస్తానన్నారు. కార్యక్రమంలో చదలవాడ హరిప్రసాద్, చదలవాడ విజయభాస్కర్, ఎస్.కిరణ్‌కుమార్, ఎం.వి.రమణయ్య, రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, పి.శ్రీహరి, ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసులు, చంద్రనీల్, జి.విజయ, వెంకట్రావు, ఎం.నాగేశ్వరరావు, ప్రకాష్‌రావు, మునిగిరీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిల్లకూరు మండలం నెలబల్లిరెట్టపల్లికి చెందిన టీడీపీ నాయకుడు ఎం.సూర్యనారాయణ సీఎం సహాయనిధికి రూ. 18వేలు చెక్కును ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అందజేశారు. వరదబాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ. 1.10లక్షల చెక్కును 3, 4వ వార్డులకు చెందిన టీడీపీ నాయకులు గురవయ్యానాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ ఎమ్మెల్యేకు అందజేశారు.

వరద బాధితులకు రూ.25వేల చెక్కు అందజేత



కోట, సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన ఎస్‌కూబీ గ్రూప్ అధినేత, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆదివారం విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు తనవంతు సాయంగా రూ.25వేల చెక్కును మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డికి అందజేశారు.

వరద బాధితులకు దుప్పట్లు, దుస్తుల వితరణ



నాయుడుపేట, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితులకు నాయుడుపేటకు చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు చిందేటి సుజాత, పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రాజేంద్ర, జె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 500 దుప్పట్లు, 500 చీరలను ఆదివారం విజయవాడలోని 56వ డివిజన్ వడ్డెర కాలనీ, తదితర ప్రాంతాల్లో అందజేశారు. మాజీ ఎంపీపీ కన్నెమ్మ, కౌన్సిలర్ సుధారాణి, శ్రీను, పవన్ చక్రవర్తి, దినేష్, అయ్యప్ప, బాబ్జి తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



విశ్రాంత బ్యాంక్ ఉద్యోగికి పర్సును అందిస్తున్న కంట్రోలర్ శంకరయ్య

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8: ఆర్టీసీ కండెక్టర్ నిజాయితీని చాటుకున్నాడు. ఉదయగిరి నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నాయుడుపేట పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కోటయ్య నెల్లూరులో బస్సు ఎక్కాడు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో కోటయ్య దిగే సమయంలో తన పర్సును పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ కండక్టర్ సూర్యనారాయణకు ఆ పర్సు దొరకడంతో బస్టాండ్ కంట్రోలర్ శంకరయ్యకు అందజేశాడు. అందులో ఉన్న ఫోన్ నెంబరు ఆధారంగా కోటయ్యకు సమాచారం అందించి బస్టాండ్‌లో పర్సును అందజేశారు. ఆర్టీసీ కండక్టర్ సూర్యనారాయణకు కోటయ్య అభినందనలు తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణా



గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: మండలంలోని విందూరు గ్రామ సమీపం నుంచి కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు చెప్పారు. ప్రస్తుతం ఇసుకను డిమాండ్ ఉండడంతో విందూరు గ్రామ సమీపంలోని పంబలేరు వాగు నుంచి కొందరు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తున్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును నియంత్రించాలని కోరుతున్నారు.

వాహన చోదకుల నిరసన



నీరు కలిసిన పెట్రోల్‌ను చూపుతున్న వాహన చోదకులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8: పెట్రోల్‌లో నీరు పోసి కల్తీ చేసి పడుతున్నారంటూ నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద శనివారం వాహనచోదకులు నిరసన తెలియజేశారు. పలువురు వాహనదారులు తమ మోటరు సైకిళ్లకు పెట్రోల్ పట్టించుకున్నారు. కొంతదూరం వెళ్లే సరికి వాహనాలు నిలిచిపోవడంతో పరిశీలించగా పెట్రోల్‌లో నీళ్లు వచ్చినట్లు గుర్తించారు. దీంతో పెట్రోల్ బంకువద్దకు చేరుకొని నిరసనకు దిగారు. దీనిపై పెట్రోల్‌బంకు సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంకుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మ్యాన్ మృతి

తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుపతి - రేణిగుంట రోడ్డులో ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వాచ్‌మ్యాన్ దుర్మరణం చెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన వివరాలు ... డక్కిలికి చెందిన మునెయ్య(49) తిరుపతిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో వాచ్‌మ్యాన్. శనివారం సాయంత్రం రేణిగుంట రోడ్డు నుంచి తిరుచానూరుకు వెళ్లే క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సమీపంలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మునెయ్య మృతి చెందాడు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించగా సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో తిరుపతి జిల్లా డక్కిలి మండలవాసిగా గుర్తించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు







తోలిమిట్టలో ఆభరణాల తయారీ వినాయక ప్రతిమ - పెద్ద శివాలయం వద్ద వైద్య వినాయక ప్రతిమ - ఎస్ఆర్‌పి సెంటర్‌లో వినాయక ప్రతిమకు ఎమ్మెల్యే పాశం ప్రత్యేక పూజలు - తడలో వినాయక పూజల్లో యువత - నాయుడుపేట దర్గావీధిలో కొలువై ఉన్న గణపయ్యకు నెలవల సుబ్రమణ్యం ప్రత్యేక పూజలు

గూడూరు, సెప్టెంబరు 8: పట్టణంలో శనివారం వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధతో జరుపుకున్నారు. పలు కూడళ్లల్లో వినాయక ప్రతిమలను, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. ఇళ్లలో ప్రతిమలను ఏర్పాటు చేసి ఉండ్రాళ్లు, కుడుములు తదితర పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. పట్టణంలోని ముత్యాలపేట, రాణీపేట, తూర్పువీధి, మాళవ్యా నగర్, వీరారెడ్డిపల్లి, రాణీపేట, ఎస్‌ఆర్‌పిసెంటర్, అశోక్‌నగర్, నలజాలమ్మవీధి తదితర ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద పందిళ్లు ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు జరిపారు.

బాలాయపల్లి: మండలంలో చవితి పండుగను గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వెంగమాంపురం, మల్లెమాల సహా పలు గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానం చేశారు.

చిల్లకూరు: మండలంలో చవితి సందర్భంగా వినాయక ప్రతిమలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి చవితి వేడకలను ఘనంగా జరుపుకున్నారు. స్వామివారికి లడ్డూలు, ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యంగా నివేదించారు. అదేవిధంగా పలు ప్రతిమల వద్ద ఆదివారం అన్నదానం చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలో చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పటు వీధుల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తోలిమిట్టలో బంగారు ఆభరణాలు చేస్తున్న వినాయక ప్రతిమ, పెద్ద శివాలయం వద్ద వైద్యం చేస్తున్న ప్రతిమ ఆకట్టుకుంటున్నాయి.

తడ: చవితి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వాడవాడలా ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. బజారులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం కొన్నిచోట్ల నిమజ్జనం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాయుడుపేట: చవితి వేడుకలను శనివారం వాడవాడలా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గావీధిలో వినాయక చవితి వేడుకల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీ.జనార్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలు కూడళ్లలో ప్రతిమలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు.

ఓజిలి: చవితి పర్వదినాన్ని మండలంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వాడవాడలా గణనాథుడి ప్రతిమలను ఏర్పాటుచేసి యువకులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పూజలో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటసుబ్బయ్య, యూనిట్ ఇన్‌చార్జి కె. సత్యవరప్రసాదరావు, జయచంద్రారెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండలంలోని చవితి వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతాలైన షార్ బస్టాండు, బాపూజీవీధి, కచ్చేరివీధి పీర్లచావడి వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వివిధ రూపాల గణనాథుడి ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపూజీ వీధిలో మొక్కజొన్న కంకులతో స్వామివారి ప్రతిమను రూపొందించారు. షార్ బస్టాండు వద్ద వినాయక ప్రతిమను శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం దర్శించుకున్నారు.

వాకాడు: భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతలతో తూపిలిపాళెం తీరంలో ఆదివారం గణేశ నిమజ్జనం కోలాహలంగా జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, గూడూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు గణనాథులను ట్రాక్టర్లలో తూపిలిపాళెం సముద్రతీరానికి తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.

కోట: మండలంలో చవితి పర్వదినాలను పురస్కరించుకొని పోటాపోటీగా గ్రామోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వాకాడు మండలం తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం సముద్రంలో ఆయా గణనాథులను నిమజ్జనం చేసేందుకు యువత కేరింతలు కొడుతూ ట్రాక్టర్ల ద్వారా విగ్రహాలు తీసుకువెళ్లారు. అదే విధంగా విద్యానగర్‌లోని విద్యాగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ వినాయక ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ నుంచి నిమజ్జనానికి తూపిలిపాళెంకు తీసుకువెళ్లారు.

పెళ్లకూరు: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో పందిళ్లు వేసి పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలకరించి వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శిరసనంబేడులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి.కళ్యాణ్‌రెడ్డి అన్నదానం చేశారు. జీలపాటూరు, చిల్లకూరు, పెళ్లకూరు, చింతపూడి, చెన్నప్పనాయుడుపేట తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

డక్కిలి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం కమ్మపల్లి రోడ్డు సెంటరులోని గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఉభయదారులు డి.కోటారెడ్డి, లలితమ్మ అన్నదానం చేశారు. ఇంకా మండలంలోని కమ్మపల్లి, మోపూరు, లింగసముద్రం, పాతనాలపాడు, దగ్గవోలు గ్రామాల్లో చవితి ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా జరుపుకొంటున్నారు.

వెంకటగిరి: మండలంలోని పెట్లూరులో టెన్త్ విద్యార్థి ఇనుగంటి పవన్ కుమార్ పేపర్లతో 10 అడుగుల వినాయక ప్రతిమను రూపొందించాడు. దానికి రంగులు అద్ది అందంగా తీర్చి దిద్ది తమ వీధిలో ఏర్పాటు చేయగా పలువురు దర్శించుకుంటున్నారు. వెలంపాళెంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 25, 26 తేదీల్లో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను అంత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. కేవీకే ప్రసాదనాయుడు, పి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథనాయుడు, వి.మధునాయుడు, పి. సుబ్రమణ్యం, శివ, ఎం.ఆనంద్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.







ఓజిలిలో ఊరేగుతున్న గణనాథుడు - సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ వీధిలో మొక్కజొన్న కంకుల వినాయక ప్రతిమ - షార్ బస్టాండు వద్ద గణనాథుడిని దర్శించుకున్న శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి - వెంకటగిరి పట్టణంలోని పెట్లూరులో పేపర్లతో రూపొందించిన గణనాథుడి విగ్రహం - విద్యానగర్‌లో పూజలు అందుకుంటున్న గణనాథుడు

నమ్మండి... ఇది తారు రోడ్డే!

పెళ్లకూరు, సెప్టెంబర్, 8: మండలంలోని పెసల గుర్రప్పతోట నుంచి పాలచ్చూరు వరకు ఉన్న తారు రోడ్డు నామరూపాల్లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1992లో అప్పటి సీఎం నేదురమల్లి జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో ఈ మార్గంలో ఉన్న స్వర్ణముఖి నదిపై లో లెవల్ బ్రిడ్జి నిర్మించి పెసల గుర్రప్పతోట నుంచి పాలచ్చూరు ఎస్టీ కాలనీ వరకు 5.7 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించారు. అయితే దశాబ్దకాలంగా రోడ్డును పట్టించుకోకపోవడంతో రోడ్డుపై తారు లేచిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయంగా మారింది. ఈ మార్గం మీదుగా 11 గ్రామాల ప్రజలతో పాటు మేనకూరు సెజ్‌కు కార్మికులు కూ డా రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా మండల కేంద్రానికి చేరుకో వడానికి 11 గ్రామాలకు ఇది ప్రధాన రహదారి. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్డును బాగు చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.



తారు లేచిపోవడంతో మట్టి రోడ్డుగా మారిన పెసలగుర్రప్పతోట దారి



మట్టి విగ్రహాలను పూజించాలంటూ సైకత శిల్పం

కోట, సెప్టెంబరు 8: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరంలో ఆదివారం మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ చిల్లకూరు మండలం ఏరూరుకు చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సైకత శిల్పాన్ని నిమజ్జనానికి వచ్చే పలు మండలాల భక్తులు, పలు గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలకు స్వస్తి పలకి మట్టి విగ్రహాలను పూజిద్దామంటూ సైకత శిల్పం ద్వారా ప్రజలకు తెలియజేశారు. దీనివలన జలచరాలతోపాటు మనిషి మనుగడను కాపాడుకుందామంటూ సైకత శిల్పి సనత్‌కుమార్ పిలుపునిచ్చారు.

నిమజ్జనానికి 70మందితో బందోబస్తు

వాకాడు, సెప్టెంబరు 8: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో గణేశ నిమజ్జనానికి 70 మందితో బందోబస్తు కల్పించినట్లు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం తెలిపారు. నిమజ్జనం సందర్భంగా నిబంధనలు పాటించాలన్నారు. 3వ రోజు నిమజ్జనానికి 5 బోట్లతో మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో తీరంలో గస్తీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, వాకాడు, కోట ఎస్‌ఐలు నాగబాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం 6 గంటల్లోగా...

కోట, సెప్టెంబరు 8: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని సముద్రతీరంలో ప్రతిమల నిమజ్జనం సందర్భంగా ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కె.జయజయరావు హెచ్చరించారు. కోట మండలం శ్రీనివాససత్రం తీరంలో ప్రతిరోజు ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటలలోపు మాత్రమే ప్రతిమలను నిమజ్జనం చేయాలన్నారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.



నిమజ్జన ఏర్పాట్లన పరిశీలిస్తున్న ఆర్డీవో

కులవృత్తితోపాటు పర్యావరణ హితం కోరి...

● మట్టి వినాయక ప్రతిమల తయారీలో విశ్రాంత ఎస్‌ఐ

రామచంద్రాపురం, సెప్టెంబరు 8: తమ తాత, ముత్తాతల నుంచి వచ్చిన కులవృత్తిని వదలేక... కాలుష్యం వెదజల్లుతున్న రంగు బొమ్మల తయారీ వద్దంటూ ఓ విశ్రాంత ఎస్‌ఐ నడిరోడ్డుపై మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి విక్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం మండలంలోని కమ్మపల్లెకు చెందిన త్యాగరాజులుశెట్టి తిరుపతిలో ఎస్‌ఐగా పదేళ్ల పాటు పనిచేశారు. తండ్రి కుండలను తయారు చేసేవారు. చిన్నప్పటి నుంచి తండ్రికి చేదోడు వాదోడుగా త్యాగరాజుశెట్టి ఉండేవారు. ఉన్నత చదువులు చదివి ఎస్‌ఐగా తిరుపతిలో పదేళ్లకు పైగా పనిచేశారు. ప్రతి యేడాది దీపావళికి ప్రమిదలు, మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసేవారు. ఈ క్రమంలో తన కులవృత్తిని మరచిపోకుండా పర్యావరణాన్ని కాపాడటానికి వినాయక చవితి మూడురోజుల ముందు నుంచే తిరుపతి బైరాగిపట్టెడ వీధిలో తన కుటుంబ సభ్యులతో కలిసి మట్టి బొమ్మలను తయారుచేసి తక్కువ ధరకే విక్రయించారు.

వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై పోలీసులకు ఫిర్యాదు

రామచంద్రాపురం, సెప్టెంబరు 8: ఓ దినపత్రికలో ఎమ్మెల్యే నానిపై వచ్చిన వార్తను పలువురికి ఫార్వాడ్ చేసిన వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఆర్‌సీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండల పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఎమ్మెల్యే నాని తన అనుచరుల ద్వారా ముడుపులు తీసుకున్నారని ఓ దినపత్రిక వార్త ప్రచురించిందన్నారు. దీనిని చంద్రగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సెంథిల్‌కుమార్‌తోపాటు ఆర్‌సీపురానికి చెందిన మరో ఇద్దరు పలువురికి వాట్సప్ మెసేజ్ పెట్టారన్నారు. నానిపై తప్పుడు సమాచారాన్ని పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల రెడ్డి, జనార్దన చౌదరి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలనంబి అవతార మహోత్సవం

తిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణమాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమలనంబి ఆలయంలో ఉదయం 9.30 నుంచి 16మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒక్కరైన తిరుమలనంబి శ్రీవారికి తీర్థకైంకర్యం ప్రారంభించిన విషయం తెలిసిందే.

రేపు అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానరూరు, సెప్టెంబరు 8: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని 10వ తేదీ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 7నుంచి 9.30గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. దీంతో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. కాగా సెప్టెంబరు 16 నుంచి 18వ తేదీ నుంచి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయి. సెప్టెంబరు 15న సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 16న పవిత్రప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ జరగనుంది. 18న మహాపూర్ణాహుతి నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో లోకాయుక్త

తిరుచానూరు, సెప్టెంబరు 8: తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి లక్ష్మణరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపడుతాయి

● ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట, సెప్టెంబరు 8: పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతాయని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. వినాయక చవితి పండుగ పర్వదినాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి దర్గావీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను విజయశ్రీ, పార్థసారధి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలు ఐకమత్యంగా పండుగ జరుపుకోవడం ముఖ్యంగా యువత ఉట్టి మహోత్సవాలు, అన్నదానాలు చేయడం అభినందనీయమన్నారు. వారి వెంట మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేష్, చంద్రారెడ్డి, శేషం మునిగోపి, సాయిరాం కిషోర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలతో పని లేని వైద్యం ఫిజియోథెరపీ

నాయుడుపేట, సెప్టెంబరు 8: ఎటువంటి ఔషధాలు లేకుండా చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఫిజియోథెరపీ ఉపశమనం కలిగిస్తుందని ఫిజియోథెరపిస్టు విజయామేరీగ్రేస్ అన్నారు. ఫిజియోథెరపి డే సందర్భంగా ఆదివారం నాయుడుపేట మండలం విన్నమాల చర్చిలో ఫిజియోథెరపిస్టు విజయమేరీ గ్రేస్‌ను స్థానికులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ భారతదేశంలో 1894లో ఫిజియోథెరపి ప్రవేశమైందన్నారు. రెండవ ప్రపంచయుద్ధంలో అనేకమంది సైనికులకు తీవ్ర గాయాలుకావడంతో వారికి సరిపడ మందులు లేకపోవడంతో ఫిజియోథెరపి ఎంతగానో ఉపకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బందిల మోహన్, శేఖర్‌బాబు, పాస్టర్ ప్రేమ్‌కుమార్, కిషోర్, శ్యామల తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 8: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళమ్మకు...

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: స్థానిక తాళమ్మ ఆలయంలో ఆదివారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8: ఐకమత్యంగా ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరులో దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమ సంఘం పని చేస్తుందన్నారు. వెంకటసురేష్, మాధవయ్య, ఉదయ్‌భాస్కర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడిలో నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8 : నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో సప్తగిరి కాలనీలో జరిగిన దాడి కేసులో నలుగురికి గాయాలు అయ్యాయి. ఆదివారం రాత్రి కాలనీలో జరుగుతున్న పూజల వద్ద జరిగిన వివాదంతో భానుప్రకాష్, రాజేష్, రాకేష్, విజయ్ పరస్పరం దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలికి చేరుకొని గాయాలపాలైన వారిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ బోల్తా : ఇద్దరికి గాయాలు

వాకాడు, సెప్టెంబరు 8 : మండలంలోని వాకాడు ఏఎంసీ కార్యాలయం సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరుకొత్తపాళెంకు చెందిన బట్టా రమణయ్య మరో వ్యక్తితో కలసి కోటలో పని నిమిత్తమై బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కోట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.35 కోట్లు

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.6.35 కోట్లు లభించింది. గురువారం, శుక్రవారం కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.6.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శుక్ర, శనివారాల్లో 1.42 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈ రెండు రోజుల్లో 53,159 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.